ఆదివారం
ప్రజాశక్తి
జనవరి 30, 2005

నెమలి
మన జాతీయ పక్షి

హ్యాపీ బర్త్‌డే

(30.01.2005 నుండి
05.02.2005 వరకు)



బి.సౌమ్య
1సం॥
వాణిశ్రీ-సత్యనారాయణ యాదవ్
మేడ్చల్-రంగారెడ్డి

కృష్ణ దీపక్
1 సం॥, 31.01.2004
శ్రీదేవి-రమేష్
అప్పనపల్లి-మామిడికుదురు

సౌమ్య
29.01.2001
స్వాతి-శ్రీనివాసచారి
మిర్యాలగూడ-నల్లగొండ

జయసాయి
2 సం॥, 31.01.2003
బిసికాలనీ
మక్కువ-విజయనగరం

గుడిపల్లి జ్యోత్స్న
2 సం॥, 1-2-2003
పద్మ-నారాయణ
మల్లవరం - ఖమ్మం

ప్రహర్ష-రోహిత్
1.2.2002-3.2.2000
సుజాత-గంగయ్య
ఆత్మకూరు-కర్నూలు



షేక్ తెయిజ్ మౌలానా
22.01.2004
జారాసంఘం

కె.వినయ్
5.02.1999
దుర్గ-కె.యమ్.దాస్
మంగళగిరి-గుంటూరు

యెల్ల రమ్యకృష్ణ
8సం॥, 31.01.1997
సరిత-పోశెట్టి
వేములవాడ-కరీంనగర్

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

డాగ్ డిటెక్టివ్‌లు

కుక్కలు విశ్వాసానికి ప్రతీక. 'డాగ్‌లు డిటెక్టివ్ పాత్ర" ఎలా పోషిస్తుందో చదివి ఆశ్చర్యపడ్డాను. నిజంగా తెలియని ఎన్నో విషయాల్ని 16వ తేదీ ఆదివారం అనుబంధం కవర్‌స్టోరీ చదివి తెలుసుకున్నాను.

-వి ఉషారాణి, తిరుపతి

పోలీసులకు క్లూ

కుక్కలు ఇంటి కాపలాలోనే కాకుండా పోలీసులకు క్లూ లభించేలా సహకరించి తమ విశ్వాసం చాటుకుంటాయి. కవర్‌స్టోరీలో ఈ అంశాన్ని చాలా చక్కగా ప్రతిబింబింపజేశారు. ఇంకా అనేక కొత్త విషయాలు తెలుసుకోగలిగాం. కార్టూన్ కదంబంలో కార్టూన్‌లు ప్రస్తుత పరిస్థితికి దర్పణంగా ఉన్నాయి.

-బొసుంగి లక్ష్మీకాంతమ్మ,
గాజువాక, విశాఖపట్టణం

ఆకట్టుకుంది

16వ తేదీ కవర్‌స్టోరీ మమ్మల్నే కాక మా పిల్లల్నికూడా ఎంతో ఆకట్టుకుంది. ఇంత విపులంగా రాసిన రచయితకు మా అభినందనలు. మొసలి-కోతి కథ చాలా బాగుంది. మా పిల్లలు ఎంతో సరదాపడ్డారు. 'ఊహలు ఊహలు' ఇంతి సంగతులు), ప్రకృతి సోయగాల భాందవఘడ్'(టూరిస్ట్‌గైడ్) రచనలు బాగున్నాయి.

-చిప్పాద ఉమామహేశ్వరరావు,
కురుపాం, విజయనగరంజిల్లా

నవల బతుకుతుంది

ఈ వారం జీవనశైలి లో 'నవల బతుకుతుంది' చాలా ఆసక్తిదాయకంగా ఉంది. కాలరేఖలు నవలకు కేంద్రసాహిత్య ఎకాడమీ అవార్డు రావడం నవలా రచయితలకు, పాఠకలోకానికి సంతోషాన్ని కలిగించింది. పరుగెత్తడమే మానవ వృత్తి అయినప్పుడు చదివే ఓపికలు ఆవిరైపోతున్నాయి. ఉన్న కొద్ది సమయాన్ని టీవిలు మింగేస్తున్నాయి. ఈ యాంత్రికతలకు దూరంగా సహజమైన అక్షరాల తోటలో విహరింపజేసేది నవల. అలాంటి నవలా ప్రక్రియకు పురస్కారం రావడం విశేషం. ఆ అంశంతో జీవనశైలి వ్యాసం బాగుంది.

-పెందోట వెంకటేశ్వర్లు,
సిద్దిపేట, మెదక్



విదేశీ ఉత్తరం

రియల్‌స్టోరీ అంశంలో ప్రచురించిన 'విదేశీ ఉత్తరం' స్టోరీ స్ఫూర్తిదాయకంగా ఉంది. ఆలోచనా పరిజ్ఞానంతో, ఆదర్శదృక్పథంతో కన్నవాళ్ళకు చేదోడువాదోడుగా ఉండాలని ఆ అమ్మాయి అమర్‌జహాన్ సైకిల్‌రిపేరింగ్ నేర్చుకుంది. తన తండ్రికే కాదు మనలాంటి పాఠకులకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. తనకు కాళ్లు లేకపోయినా ఆ వృత్తి నేర్చుకోవాలనే జిజ్ఞాస, అందుకు పట్టుదల నిజంగా అభినందనీయం.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాద్, హైదరాబాద్

సునామీ...సునామీ

కళాసాహితి లో సునామీపై కవితల ద్వారా సునామీ బాధితుల బాధలు తెలుసుకోగలిగాం. అమాయకుల ప్రాణాలు తీసిన జలప్రళయం కనురెప్ప పాటులో చేసిన విలయతాండవం గురించి కవిత్వం చాలా హృద్యంగా వర్ణించింది. ఓ సునామీ ఇప్పటికైనా నీ పగను చల్లార్చుకో. సునామీల శోకాన్ని అపు!

-కమ్మరి భూమయ్య,
కళావతి, దౌల్తాబాద్

ఊహలు...ఊహలు

ఇంతిసంగతులు శీర్షికలో ఈ వారం ఊహలు గురించి వాటి తీరుతెన్నుల గురించి బాగుంది. ఊహించే లక్షణం ఈ లోకంలో మానవునికే ఉండటం గొప్పవరం. మంచి ఊహలతో ముందుకు పోయినట్లయితే వదుగురి ఊహాలోకాన నిలిచిపోతాము. లేకుంటే....!?

-సుప్రియ, బద్దిపడగ,
మెదక్ జిల్లా.

కనువిందు అనుబంధం

కనువిందు చేసే రంగుల కవర్‌పేజీతో చిన్నారులకు 'హేపీబర్త్‌డే' చెబుతూ, 'మనసులో మాట'ంటూ 'ఔరా' అనిపించే 'కార్టూన్ కదంబం'తో, మానవజీవిత విశేషాలను ప్రతిబింబించే 'జీవనశైలి'తో, మంచి'కథ'లను మాకందిస్తూ, అద్భుతమైన చిత్ర వి'చిత్రం'తో, 'వీరీ వీరీ గుమ్మడిపండు వీరి పేరేమి?' అని దాగుడుమూతలాడుతూ, ప్రతిభావంతుల 'రియల్ స్టోరీ' తో మాకు స్ఫూర్తినిస్తూ, మనస్సుకు హత్తుకునే కథా'కచేరీ'నందిస్తూ, ఆపన్నులకు 'న్యాయసలహా' లనిచ్చి, 'ఆరోగ్యం' కాపాడుకోమంటూ 'రుచి'కరమైన వంటకాల్ని నోరారా తినిపించే ఓ ప్రజాశక్తీ! నీకివే మా హార్దిక శుభాకాంక్షలు.

-సి బాలాజీ(ఆదిత్య),
పామూరు, ప్రకాశంజిల్లా

అన్ని బాగున్నాయి

ఈ వారం కవర్‌స్టోరీ -డాగ్ డిటెక్టివ్‌లు, మనలో మాట-లంచం, జీవనశైలి, గెలుపెవరిది -కథ, కార్టూన్‌కదంబం, రియల్‌స్టోరీ, ప్రకృతిసోయగాల బాంధవఘడ్, టీవీనందుల ప్రదానోత్సవం, సునామీ విలయంపై కవితలు అన్ని అంశాలూ బాగున్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్.

మనలో మాట

సిగ్గుమాలినతనం

సిగ్గే సింగారమన్నారు!

అన్నారుగదాని ప్రతి అడ్డమైన సందర్భానికీ సిగ్గులొలకబోస్తుంటే చూసేవాళ్లకి చిరాగ్గా వుంటుంది. వళ్లు మండిపోతుంది! నీపేరేమిటి బ్రదరూ అని ఎవరైనా అడిగినప్పుడు ఆ బ్రదరు తన పేరు చెప్పకుండా సిగ్గుతో మెలికెలు తిరిగి పోతుంటే డొక్కలో తన్నాలని కోరిక కలుగుతుంది!

అంచేత

బ్రదర్ని పేరడిగినప్పుడు ఆ బ్రదరుకి శోభనం గది తాలూకు తలుపుల దగ్గిర సీను గుర్తుకు రాకూడదు!

గుర్తుకి వచ్చినా గుట్టుగా వుండాలి!

అది రూలు!

జేబులు కొట్టి బతకడానికి సిగ్గులేదూ అని ఎవరైనా కోప్పడినప్పుడు - సిగ్గుపడాలికదాని మొహాన్ని చేతుల్తో కప్పుకుని సిగ్గుపడితే చెప్పుతో కొడతారు!

సిగ్గులేని బతుకు బతికేం ప్రయోజనమన్నప్పుడు పెదవి కొరుక్కుని సిగ్గుపడితే సరిపోదు!

ప్రజాభిప్రాయాన్ని మన్నించి తప్పుడు పనులు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి!

అది తనకి అసాధ్యమనుకున్నప్పుడు

ప్రజలకోరిక మేరకు హుసేన్‌సాగర్లో దూకి చావనైనా చావాలి. లేదూ - ఉరిపోసుకుని ఇంక సెలవని తన అవతారాన్ని ముగించనైనా ముగించాలి!

అంతేగాని

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గనే ఫక్కీలో సిగ్గుమాలిన వ్యవహారాలు నడిపించే మనిషిని జాతి క్షమించదుగాక క్షమించదు!

అవకాశవాదులూ దుష్టరాజకీయాలకు అలవాటుపడిన వాళ్లూ. పరాన్న భుక్కులూ.. తిన్నయింటివాసాలు లెక్కబెట్టే.. చమత్కారులు సిగ్గన్న మాట తమ డిక్షనరీ నుండి తొలగించి బతికేస్తారు. ఛీఛీ పొమ్మని తరిమికొట్టినా చిద్విలాసంగా నవ్వేస్తారు!

వీళ్లని దూరంగా వుంచడం

సమాజానికి శ్రేయస్కరం!

ఈ సంచికలో . . .

ఔరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతి సంగతి . . .	16
నువ్వద్ది . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

"చెదిరిన కల"

కథ ... 8, 9

సువర్ణం

రియల్ స్టోరీ ... 14, 15



పాపికొండల నడుమ... గోదావరి తీరాన

టూరిస్ట్‌గైడ్ . . . 21



నాటకానికి నీరా'జనం'

కళాసాహితి . . . 22, 23

"ఓమ్...వాజ్‌పాయే నమః..."

"భక్తులందు వీర భక్తులు వేరయా..." అన్నట్లు వీరాభిమానులు చేసే, చేయించే పనులు బహువిచిత్రంగా ఉంటాయి సుమండి! బాలీవుడ్ నటీమణి ఖుష్బూపై మెండుగా దండిగా అభిమానం పెంచుకున్న ఒక ఫేవరెట్ మహాశయుడు తమిళనాడులో ఏకంగా ఖుష్బూదేవాలయం కట్టేశాడు. దీన్ని తమిళన్నయ్యల ఓవరేక్షన్ అని సరిపెట్టుకోవచ్చు గానీ...గ్వాలియర్‌లో అటల్‌బిహారీ వాజ్‌పాయ్ సజీవుడై వుండగానే గుడి కట్టడవేంటి చెప్పండి. శ్రీమాన్ అటల్‌భక్త్ & అడ్వకేట్ విజయ్‌సింగ్ చౌహాన్ అనే అయన మొన్నటి డిసెంబర్ 25న వాజ్‌పాయ్ బర్త్‌డే గిఫ్ట్‌గా అటల్ ఆలయాన్ని కట్టి పూజలు మొదలెట్టాడు. త్వరలో 'చిత్రశాల' అనే పేర వాజ్‌పాయ్ చిత్రమాల, 'సాహిత్యశాల' పేర వారి సాహిత్యసర్వస్వానికి ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేయబోతున్నార్ట!! ఈ వీరభక్త శిఖామణి వెనుక అటల్జీవారి ప్రియమేనల్లుధు అనూప్ మిశ్రా ఉన్నాడనుట కొసమెరుపు !!!

అక్కడదక్కడే...ఇక్కడెదిక్కడే!

అది ముంబయ్‌లోని ప్రవాసీ భారతీయ దివస్ సమ్మేళన్ జరుగుతున్న మహావిరాట్ ప్రాంగణం. తెల్లటి ధోవతీ కట్టి, పైన ఓ అంగవస్త్రం కప్పుకుని, ఆచ్ఛాదనలేని నునుపైన బొజ్జపై సమ్మేళన్ ప్రతినిధి కార్డు వేలాడేసుకున్న ఓ భారీశాల్తీ అటూ ఇటూ తిరుగుతూ అందరి కళ్ళలో పడ్డది. చేతిలో ఖరీదైన బిజినెస్ బ్లాక్ బ్రీఫ్ కేస్ మాత్రం షరా మామూలే. ఆ భారీశాల్తీ పేరు కరుప్పన్ చొక్కలింగం. డైరెక్టర్ ఆఫ్ బాలాజీ పిటివై. అవ్వడానికి భారతీయ తమిళతంబి అయినా వచ్చింది మాత్రం ఆస్ట్రేలియాలోని విక్టోరియా నుండి మరి! ప్రవాసీ భారతీయ దివస్‌లో పాల్గొన్నట్లు వుంటుంది, ఎవరైనా తన బిజినెస్సులో పెట్టుబడి కలపడానికి పనికొచ్చే శాల్తీ ఏదన్నా తగుల్తుందేమోనని వెతుక్కున్నట్లుంటుందనేసి ఇంత దూరం వచ్చాడు మరి!! అందుకే తనలాంటి తమిళతంబీలెవరన్నా తన కంటగానీ, తన నల్లని బ్రీఫ్‌కేస్ మెరుపుగ్గానీ దొరక్కపోతారా అని దయచేశాడేమో...ఊరకరారు కదా నేటి ప్రవాసీయులు. స్వామికార్యంబు, స్వకార్యంబు రెండున్ చక్కబెట్టుకొను విధంబనగా ఇదే!

సెల్లుఫోనూ...వీరస్పీచ్చి

"సెల్‌ఫోన్ ధ్వనిలా నవ్వేదానా..." అని కమల్‌హాసన్ డ్యాన్సు పాట విన్నాం కదూ! ఇప్పుడు "సెల్‌ఫోన్ పగిలే స్పీచ్చిదిగో" అని మన బిజెపీ మహాన్‌లు అంటున్నారు వినండి మరి! ఆ మధ్య బిజెపి నాయకులు గోపీనాథ్ ముండే గారు పనిమీద అమెరికా వెళ్ళారు. అదే టయానికి ముంబయిలోని "వంజరా క్రాంతిదళ్" వారు ఓ పెద్దర్యాలీ పెట్టారు. ఆ ర్యాలీనుద్దేశించి ఉపన్యాసం ఇవ్వాల్సిన పెద్దలు ఈ ముండేగారే మరి. ఆయనమో ఏడేడు సముద్రాలావతల అన్నంత దూరాన అమెరికాలో ఉన్నారాయే! అయినాగానీ ఎంపీ హరిభావ్ రాథోడ్ మహాశయ్ 'మీరేం నిరాశపడక్కర్లేదు... మన నాయకమహాన్ ముండేజీ స్వయంగా మీతో సందేశించబోతున్నారు" అని ప్రకటించేశారు. తీరా ఆ ర్యాలీ ప్రారంభమవుతుండగా... ముండేగారి గొంతున్న సెల్‌ఫోన్‌ను మైక్ గొంతుక్కాయ...అదేలేండి మౌత్‌పీస్ వద్ద పెట్టారు. ఓ ఐదునిముషాలపాటు వీరలెవల్లో ఉద్రేకపూరిత సందేశాన్ని ఇచ్చేశారు. ఆనందోద్రేకపరవశులైన సదరు కార్యకర్తలు "ముండేజీ ఆగే బఢో...హమ్ ఆప్‌కే సాథ్ హై" అనేసి అదే సెల్‌ఫోన్‌లో ఆవతలి తీరానికి వినబడేలా నినాదంలా లక్ష గొంతుల వాల్యూంలో అరిచేశారు.

కార్టూన్ కదంబం


కంగారు పడకండి స్వామి, ఇవన్నీ పరిశీలించాక గానీ మీరు దోషులని తేలదు
జయేంద్రపై 8 వందల పేజీల ఛార్జిషీటు


నరేంద్ర వ్యాఖ్యలు
నొప్పిగా వుందా సార్, ఏమనుకోకండి
వైఎస్
కేసీఆర్


ఊ... మందుపాతరలు ఎక్కడ పెట్టారో చెప్పు, దళసభ్యులు ఎక్కడున్నారో చెప్పు...
వైఎస్ ప్రభుత్వంలో కూడా మావోయిస్టులు ఉన్నారు: హోంమంత్రి జానారెడ్డి
నారు

నెమలి మన జాతీయపక్షి

ఉదయ శంకర్

చిన్నప్పుడు మనం పుస్తకాల పేజీల మధ్య నెమలి ఈకను పెట్టుకుని అది ఎప్పుడు నెమలి కన్ను(పింఛం)గా అవుతుందా అని ఎంతో ఇష్టంగా తరచితరచి చూసుకునేవాళ్ళం. మనకు బాగా ఇష్టమైన స్నేహితులెవరయ్యా అంటే అడగ్గానే పుస్తకంలోని నెమలి పింఛంలోని రెండుమూడు ఈకల్ని తుంచి వాడి/ఆమె పుస్తకంలో పెట్టడమే గుర్తు.

పురాణకథల్లో, జానపదకథల్లో, పిల్లల బొమ్మల కథల పుస్తకాల్లో ఈ నెమలి గురించి చదివేవుంటాం. మనం సినిమాల్లో, సినిమాపాటల్లో ఈ నెమలినీ దాని అందాన్ని ఆస్వాదించేవుంటాం. ''ఆడవే మయూరీ...నటనమాడవే మయూరీ'' అనో, "నెమలికి నేర్పిన నడకలివీ" అనో ఇలా అనేక పాటల్లో నెమలి నాట్యాల్ని ఊహల్లోకి నర్తింపజేసుకున్నాం.

ఈ నెమలి ఎక్కడెక్కడుంటుందంటే...

సింధూ నదికి తూర్పు నుండి దక్షిణం వరకూ గల భారత ఉపఖండంలో మాత్రమే దర్శనమిచ్చేది ఈ నెమలి. అంటే ఇది భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మా, శ్రీలంక మొదలగు పూర్వసింధూ లోయ ప్రాంతంలో కనబడే అపురూప జాతిపక్షి. అందుకే మన దేశానికే కాదు బర్మా దేశం కూడా 'బర్మానెమలి'ని తమ జాతీయ పక్షిగా ఎన్నుకున్నారు. శ్రీలంక దీని రూపానికి దగ్గరగా ఉండే 'సిలోన్ జంగిల్ ఫావుల్' తన దేశ జాతీయపక్షిగా పెట్టుకున్నారు. మన దేశంలో జమ్మూ & కాశ్మీర్, తూర్పు అస్సాం, దక్షిణ మిజోరాం తదితర భారత ద్వీపకల్పమంతా ఈ నెమళ్ళు పుట్టి పెరుగుతున్నాయి. మన రాష్ట్రంలో నల్లమల, అభయారణ్య అటవీప్రాంతాలలో ఉన్నాయి. గిరిజనప్రాంతాల ప్రజలు మినహా మైదాన, పట్టణ ప్రాంతాల ప్రజలమైన మనందరం జూపార్కులలో, ఎగ్జిబిషన్‌లలో చూడాల్సిందే.

నెమలి అడవుల్లో తిరుగాడే వేటపక్షి, ఆహారానికి ఉపయోగపడే జాతికి చెందింది. సైన్స్‌పరంగా 'పావా క్రిస్టటస్(లిన్నయిస్)' జాతికి చెందింది. రంగురంగులతో, బాతు కంటే పెద్దసైజులో ఉంటుంది. దీని వెనుక భాగాన విసనకర్రలాగా విచ్చుకునే, ముడుచుకునే పద్ధతిలో దాదాపు రెండు వందల పింఛములతో పెద్దతోక ఉంటుంది. ఈ పక్షి అందమంతా పింఛాలలోనే ఉంది. కన్నుల కింద తెల్లటి చారిక, పొడవైన మెడ, ప్రకాశవంతమైన నీలివర్ణపు పొట్ట, రాగి-ఆకుపచ్చ-నీలం రంగుల సమ్మేళనంలోని పింఛాల గుత్తి...ఓహ్...మగనెమలి అందం వర్ణనాతీతం.

ఈ జాతిలో ఆడ కంటే మగవే అందమైనవంటే విచిత్రంగా, గమ్మత్తుగా వుంటుంది. మగ నెమలి పురివిప్పి ఆడిందంటే ఆడనెమలి దాని వలపుల వలలో పడాల్సిందే. ఆడనెమలి గోధుమ వర్ణంలో ఉండి మగనెమలికంటే కొద్దిగా చిన్నవిగా ఉంటాయి. మనలో చాలా మందికి మగనెమళ్ళు మాత్రమే నాట్యం చేస్తాయని తెలియదు కూడా. తెలియక 'నాట్యమయూరం' అనడానికి బదులు 'నాట్యమయూరి' అనంటుంటారు. పురివిప్పి నాట్యం చేస్తున్న మగ నెమలి మన దేశ జాతీయపక్షి చిహ్నం.

మగనెమలి మన జాతీయపక్షి. మన భారతదేశం ఓ అందమైన, అపురూపమైన పక్షిరాజాన్ని తన జాతీయ పక్షిగా నిర్ణయించుకుంది. పురివిప్పి ఆడుతున్న నెమలి ఎందరెందరో కవుల, రచయితల వర్ణనకు అలంకారప్రాయమైంది. నాట్యానికే ఈ నెమలి ప్రతీక అయ్యింది. "నాట్యమయూరం" అనే విశేషణం భాషకు అందించింది. సింధూలోయ పరివాహక ప్రాంతంలో మాత్రమే పుట్టిపెరిగే ఈ అందాల, అపురూప నెమలిని మన జాతీయ పక్షిగా భారతప్రభుత్వం ఎన్నుకుంది. జనవరి 31వ తేదీ నెమలిని జాతీయపక్షిగా నిర్ణయించిన రోజు.

జాతీయ చిహ్నాలుగా ఎన్నుకోవడం వెనుక...

"Symbols are key-holes to doors in the walls of space, and through them man peers into eternity"

- Manly P. Hall

"Every symbol- in every nation religion- may be read esoterically"

- H.P.Blavatsky

!...ఇలా ఎందరో పెద్దలు ఒక జాతీయచిహ్నంగా ఎన్నుకునే అంశాల వెనుక ఉండే సైద్ధాంతిక విషయాలు చెప్పారు. అంత మేధోపరమైన అంశాల్నే ఇలా సరళంగా చెప్పుకోవచ్చు. నిగూఢమైన సందేశాన్నో, అర్థాన్నో, భావాన్నో వ్యక్తం చేసేవి "చిహ్నాలు" గా ఎంచుకోవచ్చు. బహుశా మన దేశ మేథావులు ఈ విషయాల్లోంచే, ఈ ప్రమాణాల్లోంచే మన జాతీయ చిహ్నాలను నిర్ణయించివుంటారు. ఇతర దేశాల జాతీయ చిహ్నాలకు కూడా ఇదే ఆలోచించివుంటారు.

మన జాతీయ చిహ్నాలు

కనిపించే మూడుతలల (కనబడని నాలుగో తల) సింహాలున్న అశోకుని స్థూపం మన జాతీయ చిహ్నం. యుద్ధకాంక్షనుండి శాంతియుత సహ జీవనానికి, పరిపాలనకు మళ్ళిన అశోకుని శాంతిమార్గానికి సూచిక ఆ చిహ్నం. సారనాథ్‌లో ఉన్న బౌద్ధస్థూపంలోని చిహ్నమే మన రాజ్యాంగ చిహ్నంగా వుంది. జాతీయ పుష్పంగా పద్మాన్ని, మూడురంగుల జెండా జాతీయ పతాకంగా, పసుపు మేనిపై నల్లని చారికల పులి జాతీయ జంతువుగా, మర్రిచెట్టు జాతీయవృక్షంగా, మామిడిపండుని జాతీయఫలంగా నిర్ణయించారు. ఈ క్రమంలోనే మగనెమలిని జాతీయపక్షి అన్నారు. ఈ చిహ్నాలను జాతీయ చిహ్నాలుగా ఎంచుకోవడంలో ప్రకృతిపరమైన, స్వభావపరమైన, భావపరమైన కోణాలున్నాయి. పైన పెద్దలు కొందరు భావించినట్లు ఈ చిహ్నాలను చూడంగానే మన దేశ సాంస్కృతిక, ఆత్మిక, సామాజిక, భౌగోళిక విషయాలు తెలిసేటట్లుంటాయి. మన జాతీయ ప్రత్యేకతలు ఇవీ అని చెప్పేటట్లుంటాయి. మా దృష్టి, దృక్పథం, మార్గం ఇదీ అని చెప్పేటట్లుంటాయి. మన జాతీయ చిహ్నాలన్నింటి వెనుక ఓ మంచి విశ్లేషణ ఉంటుంది. కొందరి విశ్లేషణలు మరీ విద్దూరంగా, భావోద్రేకంగా ఉన్నా ఓ పురాణగాథలాగా వినసొంపుగానే ఉంటాయి.

క్రీ.పూ. 272-232ల మధ్య పరిపాలకుడైన అశోక చక్రవర్తి యుద్ధబీభత్సం నుండి విచలితుడై, శాంతిస్వరూపుడై సారనాథ్‌లో ఓ స్థూపాన్ని నిర్మించాడు. ఆ స్థూపంపై ఒకదానివెనుక ఒకటి నిలబడ్డ నాలుగు సింహాలు, ఏనుగు, దౌడులో ఉన్న గుర్రం, పద్మపుష్పంపైన కొలువు దీరిన ధర్మచక్రం తదితర ఒక నిగూఢ సందేశాన్నిచ్చే చిత్ర,శిల్ప రచన వుంది. నాలుగు సింహాలు ధీరత్వాన్ని, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయని వర్ణించారు. ఈ నాలుగు సింహాల ప్రతిమల్ని మోస్తున్న నాలుగు చిన్న జంతువులు-సింహం ఉత్తరదిక్కుకి, ఏనుగు తూర్పుదిక్కుకి, గుర్రం దక్షిణదిక్కుకి, ఎద్దు పడమరదిక్కుకి సంరక్షకులుగా నాలుగు దిక్కులను కావలి కాస్తున్నాయని వివరించారు. ఈ ప్రతీకలను వికసిస్తున్న పద్మపుష్పంపై వుండటం మన సృజనాత్మక ప్రేరణలతో కూడిన జీవనశైలిని తెలియజేస్తాయని కూడా అర్థవివరణ చేశారు. మొత్తం ఈ శిల్పక్రమానికంతటికీ వర్తింపజేస్తూ దానికింద "సత్యమేవ జయతే" అని దేవనాగరి లిపిలో ఒక దివ్యసందేశాన్ని చెక్కారు. మన జాతీయ చిహ్నం వెనుక ఎంత అర్థం నిగూఢమై ఉందో చూశాం కదా!

బర్మా జాతీయ పతాక చిహ్నం



అలాగే మన మూడురంగుల జాతీయపతాకాన్ని కూడా ఎన్నో భావనలు, అర్థాలకనుగుణంగా రూపుదిద్దుకున్నదే. సాహసానికీ, త్యాగానికి ప్రతీకగా కాషాయం, స్వచ్ఛతకు, శాంతికి చిహ్నంగా తెలుపు రంగు, విశ్వసనీయత, పుష్కలతలకు ప్రతీకగా ఆకుపచ్చరంగు...ఇలా మూడురంగులతో పతాకం రూపుదిద్దారు. ఇలా రూపుదిద్దడంలోని దృక్పథానికి పేజీలపేజీల వర్ణనలను అనేకమంది రాశారు.

ఈ పద్ధతిలోనే మన జాతీయ పక్షిగా నెమలిని ఎలా రూపొందించారో అనేదానికి కూడా అనేక అంశాలను చెప్తూతున్నారు. నెమలి మన భౌగోళిక, భౌతిక వాతావరణంలో మాత్రమే ఉనికిలో ఉండటం అనే ప్రత్యేకత వల్ల నెమలి మన జాతీయపక్షిగా ఎన్నుకున్నారనిపిస్తుంది.



మన పురాణగాథల్లో నెమలికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఋషులు, మునులు ఎంతో పవిత్రమైన, కీలకమైన వ్యక్తులుగా మనకు కనిపిస్తారు. వారు తపమాచరించే తావులలో, వారి ఆశ్రమాలలో ఈ నెమలిని తప్పనిసరిగా ఉంచారు మన పురాణసాహిత్య రచయితలు. ఆయా రాజన్యులు, వారి అంతఃపుర రాణులు, రాకుమార్తెల చెంత ఈ నెమలికి ఒక ఆత్మికమైన స్థానంలో ఉంచారు. అంతే కాదు. మన భారతీయులలో ఎందరో భక్తుల ఇష్టదైవాల సాన్నిధ్యంలో, ఇంద్ర-దేవేంద్ర-స్వర్గ-వైకుంఠ లోకాల్లో నెమలిని విహరింపజేశారు. అంతకుమించి మన పురాణగాథలలో ఒక్కొక్క భగవత్స్వరూపుడికొక జంతువునో, పక్షినో వాహనంగా ఉంచారు. శివుడి రెండవ కుమారుడైన కుమారస్వామికి వాహనంగా ఈ నెమలి ఎందరో భక్తులకు ఆరాధ్యమైనదిగా కూడా ఉంది. శైవమతస్తులకే కాకుండా వైష్ణవ మతస్తులకు కూడా నచ్చేలా శ్రీకృష్ణుడి కిరీటంలో నెమలిపింఛాన్ని ఉంచారు. శైవ, వైష్ణవ పురాణసాహిత్యాల్లో ఈ నెమలి అడుగడుగునా కనిపించి కనువిందు చేస్తూనే వుంటుంది. ఒక విధంగా పురాణ, వైదిక సాహిత్యాలు పుట్టిన చారిత్రక కాలాలనుండీ ఇటీవలి కాలాల వరకూ రెండుపాయలుగా కొనసాగుతూ వచ్చిన ద్రవిడ, ఆర్య సంస్కృతులన్నింటిలోనూ ఈ పక్షిరాజాన్ని బాగానే చూసుకున్నారు. అందువల్ల కూడా ఈ నెమలిని జాతీయచిహ్నంగా ఎంచుకోవడం వల్ల ఎటువంటి అభ్యంతరాలు ఎదురవ్వలేదు.

నెమలి ఒక చిహ్నంగా ఎప్పటినుంచి అంటే...

కొన్నికొన్ని విషయాలకు కచ్చితంగా ఇక్కడనుంచి, ఆనాటినుంచి అని చెప్పగలిగేలా రుజువులు దొరకవు. సుమారుగా, రమారమిగా చెప్పగలిగే తార్కాణాలు మాత్రమే లభిస్తాయి. ఈ నెమలి గురించి అలాంటి సమాచారమే దొరుకుతోంది. క్రీ.శ. 1వ శతాబ్దంలో కుషాణుల పరిపాలనా కాలంలో కనిష్కుడి పూర్వికుడైన హవిష్కుడు మొట్టమొదటిసారిగా నాణేలపై శివుడు, ఉమ, ఈ నెమలిని ఒక చిహ్నంగా ముద్రించినట్లుగా తెలుస్తోంది.

కార్తికేయ శకానికి చెందిన నాణేలు ఆ తరువాత వారు ముద్రించిన నాణేలకు నమూనాగా వున్నాయి. కొన్ని యథా తథంగా కొనసాగాయి. ఆదిమ గిరిజన రాజ్యాలలో పంజాబ్ ప్రాంతానికి చెందిన ఔదంబరాలు, యౌధేయులు తమ పరిపాలనాకాలాల్లో ఈ కార్తికేయశకానికి చెందిన అనేక నాణేలను కొనసాగించారు. క్రీ.శ 415-450లలో కుమారగుప్తుడు ముద్రించిన బంగారునాణెంలో నెమలిపై తన ఎడమ చేయిని రాజసంగా ఉంచిన కుమారస్వామి చిహ్నం ఉంది. ఇలా నాణేలపై, రాజముద్రికలపై నెమలి చిహ్నాన్ని ఆ తాంవాతా చాళుక్యులు, కార్తికేయులు,





విజయనగర సామ్రాజ్యం కాలాల నుండి నేటి ప్రజాస్వామ్య యుగాల వరకూ సాగుతూనే ఉంది.

స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడ్డాక తనదైన స్వతంత్ర జాతీయ చిహ్నాలను ఏర్పరుచుకుంది. ఆ క్రమంలో ఈ నెమలికి ప్రభుత్వ హోదాలో జాతీయపక్షిగా గుర్తింపు పొందింది. నాణేల మీదనే కాక ప్రభుత్వ అధికార పత్రాలపై, పోస్టల్ స్టాంపులపై, కరెన్సీనోట్లపై కూడా నెమలి చిహ్నాన్ని ముద్రించారు.

వివిధ దేశాల జాతీయపక్షులు-చిహ్నాలు

మన దేశానికంటూ జాతీయ చిహ్నాలూ, జాతీయ పక్షులు ఉన్నట్లే అనేక దేశాలకు ఏనాటినుండో ఉన్నాయి. బర్మా దేశానికి బర్మానెమలిని తమ జాతీయపక్షిగా ఎంచుకున్నారు. శ్రీలంక సిలోన్ జంగిల్ ఫౌల్ ను, బంగ్లాదేశ్ డోయలీపక్షిని, పాకిస్తాన్ చకోరం(రెడ్ లెగ్డ్ పార్ట్రిడ్జ్)ని, ఇండోనేషియా జావన్ హాక్ ఈగిల్ని, కెనడా సాధారణ నీటికోడిని(కామన్ లూన్), ఆస్ట్రేలియా ఇము పక్షిని, బ్రెజిల్ బంగారు చిలుకని, యునైటెడ్ కింగ్‌డమ్ యురోపియన్ రాబిన్‌పక్షిని, ఆఫ్రికా ఖండంలోని నల్లజాతివారి దేశాలన్నీ నల్లరంగు కొంగల ను తమ జాతీయ పక్షులుగా నిర్ణయించుకున్నాయి. కొన్ని దేశాలు జాతీయ పక్షులుగా నిర్ణయించుకున్నవాటిని చూస్తే విచిత్రంగా ఉంటుంది. కొన్ని దేశాలు ఏ ఉద్దేశ్యంతో తమ జాతీయపక్షిగా పెట్టుకున్నారో గానీ ఆ తరువాత దానికి విరుద్ధంగానో, ఆ పక్షి దుష్టస్వభావం తమకంటించుకునో ప్రవర్తిస్తున్నారనిపిస్తుంది. ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా లోని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమతమ జాతీయపక్షులను నిర్ణయించుకున్నప్పటికీ, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జాతీయ పక్షిగా తెల్లబుర్ర గ్రద్ద(Bald Eagle)ను నిర్ణయించుకుంది. అలాస్కా, కెనడా, నార్త్ మెక్సికో సముద్రతీరపక్షి అయిన ఈ జాతి గ్రద్ద 'హాలియాటస్ ల్యూకోఫాలస్' జాతికి చెందింది. ఇది స్వేచ్ఛాప్రియత్వానికి ప్రతీకగా గగనాంతరాలలో ఎగురుతుందనే లక్షణాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ పక్షినే ఎన్నుకున్నట్లు చెప్పుకున్నారు. కానీ నేడు ఆ అమెరికా పాలకవర్గం అనుసరిస్తున్న విధానాలు, చిన్న దేశాలపట్ల వ్యవహరిస్తున్న దుర్మార్గాల్ని గమనిస్తే గ్రద్దల స్వభావాన్నే పుణికిపుచ్చుకున్నారా అనిపిస్తుంది. శాంతికపోతాల్ని కబళించేయడం, ఈ పక్షిజాతికే చెందిన రాబందు లక్షణం అయిన శవాల్ని పీక్కుతినడంగా అమెరికా ఇతర దేశాలపట్ల వ్యవహరిస్తోంది. గ్రద్ద ఎగరడమే అశుభసూచకం అనే ఒకానొక నమ్మకానికి వాస్తవ రూపంగా ఈనాటి అమెరికా 'సునామీ సహాయం' ఇస్తాననే పేరుతో రావడాన్ని కూడా అశుభంగా భావించాల్సివస్తోంది. అలాగే ఒకప్పుడు ఈ ప్రపంచమంతా నాదేనని విర్రవీగిన బ్రిటీష్ పాలకులు తమ జాతీయపక్షిగా గొణుగుడు పావురం(మౌర్నింగ్ డోవ్) అన్నారు. తమదైన ప్రత్యేకత కల్గిన పక్షిగా ఆ దేశపౌరులు ఊహించుకుంటే, పాలకులు మాత్రం తన విధానాలను దానికి భిన్నంగా చూపుకుంటున్నారు. ఫిలిప్పైన్స్ దేశం కోతిని తింటున్న గ్రద్దను తమ జాతీయపక్షి చిహ్నంగా ఎన్నుకోవడం అక్కడి



దాని ప్రాముఖ్యత తెలియనివారికి విచిత్రంగా తోస్తుంది. తూర్పు ఆసియా దేశాల్లోని భారతదేశంలాంటి దేశాలకు చెందిన సాంప్రదాయచిహ్నమయిన "స్వస్తిక్" గుర్తుని తిరగేసి తన ఫాసిస్టు నాజీయిజపు గుర్తుగా హిట్లర్ స్వీకరించాడు. సాంప్రదాయ చిహ్నంగా స్వస్తిక్ మెలికవేసుకున్న సర్వదేవతలను సూచిస్తుండగా, తిరగబడ్డ హిట్లర్‌స్వస్తిక్ చావునీ దెయ్యాన్నీ(డెడ్ &



డెవిల్) సూచిస్తున్నాయి. హిట్లర్ చేసిన దానికి ఈ చిహ్నానికి సరిపోయిందనుకుంటా! చైనా దేశం ఈనాటికీ తమ జాతీయపక్షిగా దేన్ని ఎన్నుకోవాలా అని ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 'సిన్‌హువా న్యూస్ ఏజెన్సీ' వారి సర్వే ప్రకారం ఎర్రజుత్తు కొంగ(రెడ్ క్రౌన్డ్ క్రేన్) ఎన్నికవ్వనున్నట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో ఆలోచించుకుంటే నెమలి మన జాతీయపక్షిగా తగిన సాంప్రదాయబద్ధ, పర్యావరణపర గౌరవాన్నే కలిగిఉంది అనుకోవాలి. కానీ జాతీయపక్షిగా దీన్ని, దీని సంతతిని కాపాడ్డంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతోందనే అనిపిస్తోంది. వాతావరణ కాలుష్యం నియంత్రణ నిండైన మనిషికోసమే జరగనిచోట మూగజీవులకోసం జరుగుతుందనుకోవడం తియ్యటి కలే అవుతుంది. జాతీయపక్షి నెమలి వేటను, మాంసం, దాని అవయవాల అమ్మకాలను నిషేధిస్తూ 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని అమలులో తెచ్చారు. కానీ అక్కడక్కడా అధికార, అనధికార, మంత్రి మందీమార్బలాలకు నెమలిమాంసపు విందులు జరుగుతూనే ఉన్నాయి. దివంగత లోక్‌సభస్పీకర్ జి.ఎం.సి బాలయోగితో సహా నేతలు ఈ వివాదంలో ఇరుకున్న విషయం తెలిసిందే. ఇటువంటివి జరగకుండా చూసుకోగలగటం మాత్రమే కాదు. అపురూపమైనదీ, అందమైనదీ, మన ఉపఖండపు ప్రత్యేకత కలిగినటువంటిదీ, అంతిమంగా మన జాతీయపక్షిగా కేటాయించినదీ అయిన ఈ నెమలిని నిజంగా కాపాడుకోవాలి. పర్యావరణపరంగా, సాంస్కృతికపరంగా, నైతికపరంగా నెమలి అనుకూల విధానాలను మన మనుష్యజాతి చిత్తశుద్ధితో అమలుచేయాలి. ✱

అమెరికా జాతీయపక్షి



నైజీరియా జాతీయపక్షి



కానున్న చైనా జాతీయ పక్షి



ఫిలిప్పైన్స్ జాతీయ పక్షి

చెదిరిన కల

నూకపంగు వెంకయ్య

కాళ్ళ దగ్గర చినిగి నడుస్తుంటే నేలకి అటూ ఇటూ తగులుతూ, అక్కడక్కడ ఏదో నల్లటి మరకల ప్యాంటు. అడ్డ నిలువు గీతల చొక్కా, బాగా వొత్తుగా పెరిగిన జుట్టు. నడుస్తున్నాడో... పరిగెత్తుతున్నాడో, పరిగెత్తుతూ... నడుస్తున్నాడో... నడుస్తూ పరుగెత్తుతున్నాడో అర్థం కావటం లేదు. అడుగులు త్వరత్వరగా వేస్తున్నాడు.

బయట గేటు తీసుకుని లోపలకొచ్చి "పటేలమ్మా...! బట్టలున్నయ్యా" అన్నాడు లోపలున్న సుజాతకు వినపడేటట్టు.

ఆమె లోపల్నుండే "ఏమీ లేవురా, రేపురా" అంది.

వెంటనే పక్కనున్న మా రూము దగ్గరకు వచ్చి, తలుపు ముందు నిలబడి, వేలాడుతున్న డోర్ కర్టెన్‌ను పక్కకు అని "శరత్ అన్నా ఏమైనా బట్టలున్నయా?" అన్నాడు. ఆ మాటకు నేను బట్టలు మడతపెట్టి చేతికందించాను. బట్టలు తీసుకుని ఎంత వేగంగా వచ్చాడో, అంతే వేగంగా బయటకు వెళ్ళిపోయాడు సత్యం.

సత్యానిది మిర్యాలగూడ పక్కన చిన్న పల్లెటూరు గూడూరు. మట్టిముద్దల్ని ఒక దానిపై ఒకటి పేర్చి కట్టినగోడ, అక్కడక్కడ నెర్రెలు బాసి వుంది. ఆ మట్టిగోడపై నిలువుగా, అడ్డంగా పరిచిన తుమ్మ, సర్కారు కట్టెలు. ఆ కట్టెలకు పుచ్చుపట్టి తెల్లని రేణువులుగా పుచ్చు కిందికి రాలుతోంది. కట్టెలపై పరిచిన తాటాకుల కప్పుకు అక్కడక్కడ రంధ్రాలు పడి, ఆ రంధ్రాల ద్వారా సూర్యకిరణాలు సరిగ్గా ఇంట్లోనే పడుతున్నాయి. కోడి తన పిల్లల్ని రెక్కల చాటున భద్రపరిచినట్టుగా ఇంటినిండా ఉతికేందుకు తెచ్చిన రంగురంగుల బట్టలున్నాయి.

ఇంటిముందు చతురస్రాకారంగా నాలుగు కర్రల్ని పాతి, వాటిపై వేలెడంత లావున్న కర్రలు వేసి వున్నాయి. ఆ కర్రలపై పలుచగా జమ్ము పరిచివుంది. దానికింద చాలా సంవత్సరాలనాటి బల్ల, బల్లపై మందంగా పరిచిన బట్టలు. బల్లపై ఇనుముతో చేసిన అయిదారు కేజీల బరువున్న ఇస్త్రీ పెట్టె. బల్లకింద గోనెసంచిలో బొగ్గులు. ఇంటి చుట్టూ వున్న ప్రహరీ రాళ్ళగోడపై ఉతికి ఆరేసిన బట్టలు. ఇదీ సత్యం వాళ్ళ ఇంటి రూపం. చూడగానే సాకలోళ్ల ఇల్లు అని గుర్తు పట్టేట్లుగా వుంది.

సత్యం వయసు పదహారు, పదిహేడేళ్ళ మధ్యే వుంటుంది. పొద్దున కోడికూతతోనే నిద్రలేచి రెండు బర్రెల పాలుతీసి, పాలకేంద్రానికి పోసి, ఆ చీకటిలోనే సైకిల్‌పై మిర్యాలగూడలో అశోక్‌నగర్‌కు వచ్చి సాయంత్రం వరకూ ఇండ్లల్లో బట్టలుతుకుతాడు. కాస్త పొద్దెక్కేసరికే వాళ్ళ నాన్న సైదులు తెచ్చిన అన్నం తిని సుందర్‌నగర్‌కు వస్తాడు.

కాలేజీ విద్యార్థులతో సుందర్‌నగర్ సందడి సందడిగా, ఎప్పుడూ కళకళలాడుతూ వుంటుంది. మిర్యాలగూడలో కాలేజీలు ఎక్కువ వుండటం వల్ల విద్యార్థుల కోలాహలం వుంటుంది. చుట్టుపక్కల సుమారు ఇరవై గ్రామాలనుండి వచ్చి గదులు కిరాయికి తీసుకుని విద్యనభ్యసిస్తుంటారు. ఈ విద్యార్థుల బట్టల్నీ, ఇంటి యజమానుల బట్టల్నీ తీసుకెళ్ళి ఉతికి ఇస్త్రీ చేసి ఇస్తుంటాడు సత్యం.

సాయంత్రం ఐదు గంటలకు ఇంటికెళ్ళి కట్టెలు నరికి, నీళ్ళు తెచ్చి, ఆ పనీ ఈ పనీ చేసి రాత్రి పదిగంటలకు నిద్రబోతాడు. మళ్ళీ తెలవారిన దగ్గర నుండీ పడుకునే వరకూ ఆగని ఓ యంత్రమతడు. ఆరని ఇస్త్రీపెట్టె అతడు. ఇస్త్రీ పదునుకై గంజిలో ముంచి అద్దే నలిగిపోయిన గుడ్డపీలికల ముడత అతడు.

గేటు దగ్గరనుండే మాట్లాడుకుంటూ లోపలికొస్తాడు. వెళ్ళేటపుడు గేటుదాకా మాట్లాడుకుంటూనే వెళతాడు. మొహంలో ఎన్నడూ రవ్వంత నిరాశ కనపడదు. ఎప్పుడూ విచ్చుకున్న

బంతిపూవులా నవ్వుతూ వుంటాడు. అప్పుడే చేసిన ఇస్త్రీమడతలా చురుగ్గానే ఉంటాడు.

రోజూలాగే తొందర తొందరగా వచ్చి "అన్నా...! బట్టలున్నయా?" అన్నాడు. బయట తలుపు వద్దే నిలబడి. "తమ్ముడూ...రా" అని పిలవగానే చుట్టూ చూస్తున్నాడు. నేను పిలుస్తున్నది అతన్నే అని గ్రహించక. "తమ్ముడూ... లోనికిరా" మళ్ళీ పిలిచాను అతని వైపే చూస్తూ.

"వద్దులేన్న, నేనుపోత తొందరగా బట్టలియ్యి" బయటే నిలబడి అన్నాడు. "

పోదువులే...రా" అని బలవంత పెడితే వచ్చి కూర్చున్నాడు.

"అమ్మా, నాన్న ఏం చేస్తారు?" అతని వైపే చూస్తూ ప్రశ్నించాను. ఆ మాటకు సత్యం మొఖంలో రంగులు మారుతున్నాయి. తాగమని మంచినీళ్ళిచ్చి "నాన్నేం చేస్తాడు?" ప్రశ్నించాను.

"సాకలోనికి ఏనేమంటదన్నా... ఇంటింటికీ దగ్గర బట్టలు దేవడం, ఉతికి ఇస్త్రీ చేయమంటే చేసి వాళ్ళకియ్యడం ఇదే నాన్న చేసే పని. ఇప్పటిదాకా ఇండ్లల్లకు బిలిచి కూర్చోమన్నోళ్ళు లేరన్నా, బట్టలు ఇస్త్రీ చేసిస్తే నాలుగు పైసలు మొఖాన గొట్టేటోళ్లే, గానీ పుట్టినకాన్నుండి యిసుంటరా అనోళ్ళు లేరు" అంటూ ఆవేదన నిండిన స్వరంతో చెప్పాడు.

కొంచెం సేపు ఆ మాటా, ఈ మాటా మాట్లాడి అతని దుఃఖ మొఖాన్ని పోగొట్టాలని "మరి నువ్వెందుకు సదువుకోలేదు?" అన్నాను.

"సదివినన్నా, నాలుగుదాకా సదివిన గాని, తర్వాత సదువు అబ్బలేదు. అయినా మీరు సదివి ఏం జేస్తరన్నా... మీకు సదువొస్తే, నాకు సక్కంగ ఇస్త్రీ చేయటం వొచ్చు" అన్నాడు ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో.

"ఇంత చిన్న వయసులో ఎందుకు సత్యం అంత కష్టపడతవ్" అన్నాను.

"పెళ్ళికి చెల్లెలుందన్నా... నాన్న ఒక్కడే ఎంతకని బట్టలుతుకుతడు. ఎంతకని ఇస్త్రీ చేస్తడు. సదువు ఎట్గాగో అబ్బలేదు. యిట్లన్నా సాయపడదామని' అన్నాడు ధైర్యంగా. ఈ వయసులో ఆ ఆత్మవిశ్వాసం, అపుడే గుర్తొచ్చిన బాధ్యతలు మనసులో ఆనందమేసింది.

"అన్నా... నేను పోతా, పిలగాళ్ళు కాలేజీలకు పోతరు" అని నా దగ్గర నుండి లేచి బట్టలు చేతబట్టుకుని త్వరత్వరగా అడుగులు వేస్తూ బయటకు నడిచాడు.

అలా ఇల్లిల్లూ తిరిగి బట్టలన్నీ తీసుకువచ్చి, వాటిపై పలుచగా నీళ్ళుచల్లి, బొగ్గులు ఇస్త్రీ పెట్టెలోవేసి, నాలుగు కిరోసిన్ సుక్కలువేసి అగ్గిపుల్ల ముట్టిస్తాడు. కాసేపటికి కాక వస్తే ఒక్కొక్క చొక్కానీ, ఒక్కొక్క ప్యాంటునీ తీసి కొత్త బట్టలంత అందంగా ఇస్త్రీ చేస్తాడు. గుండెలోని శ్వాసనంతా నరాల ద్వారా చేతుల్లోకి తీసుకుని బట్టల్ని రుద్దుతాడు. మధ్యాహ్నమంతా కొన్ని బట్టలు చేసి, బోరింగు వద్ద కాళ్ళూ చేతులూ కడుక్కుని తండ్రి తెచ్చిన అన్నం తింటాడు.

"సత్యం బట్టలయినవా?"... అంటూ సత్యాన్ని అడిగాడు చందు. '

'అయినయి తీసకపో అన్నా" అని ఇస్త్రీ చేసి మడత పెట్టిన బట్టల్ని చందు చేతిలో పెట్టాడు.

"తమ్ముడూ... డబ్బులు లేవు, రేపిస్తా" అన్నాడు బట్టలు తీసుకుంటూ చందు.

"డబ్బులేటికి పోతయన్నా ఉన్నపుడే ఇయ్యి... చివరిదాకా మాటుంటది గానీ డబ్బుల మూటుండదన్నా" అంటూ చందూతో ఓ జీవిత సత్యాన్ని చెప్పి మళ్ళీ తన పనిలో తన పనిలో నిమగ్నమయ్యాడు.

సాయంత్రం అయ్యిందనడానికి గుర్తుగా పక్షులన్నీ తమ గూళ్ళకు చేరుకుంటున్నాయి. అటువైపుగా వస్తున్న నన్ను చూసి "అన్నా... యాడికెళ్ళి వత్తున్నవ్?" అన్నాడు. తలపైకెత్తి చూసే వరకే నవ్వుతూ సత్యం.

"బజారుకెళ్ళి వస్తున్న...ఎట్లుంది గిరాకి?"

"పండుగ ధమాకాసేల్... ఫలాన్‌ఫూల్ వారి వాషింగ్‌మెషన్ సేల్ ధమాకా... సులభ వాయిదాల్లో చెల్లింపు... మొదటి వాయిదాకే మీ ఇంట్లో బట్టలుతికే కరెంట్ యంత్రం. ఈ రోజు సుందర్‌నగర్‌లో మీ ఇంటి ముందుకే వచ్చే మొబైల్ సేల్ ధమాకాలో మీ పేరు నమోదు చేసుకోండి" ఆ కరపత్రం ఇళ్ళల్లోకి ఇస్త్రీసత్యం ఖాళీచేతులలో బయటకు...

ప్రశ్నిస్తే బాగానే వుందని నవ్వుతూనే సమాధానం చెప్పాడు. "చీకటి పడుతుంది ఇంకా ఇంటికి పోలేదేం?" అని అడిగితే "చివరిగా ఈ రెండు పాయింట్లు న్నై, చేసి పోత" అంటూ పాయింట్లను చూయించాడు. నేను వెళ్లొస్తానని అక్కడ నుండి మా రూముకి బయలుదేరాను.

అలా కొన్ని రోజులు గడిచాక, ఒక రోజు చుట్టుపక్కల రూముల వద్ద బట్టలడుగుతూ, మా రూము దగ్గరకొచ్చి ఆగాడు. కానీ...! ఇంతకు ముందున్న హుషారు లేదు. నడకలో, దిగులుగా ఏదో పోగొట్టుకున్న వాడిలా చి..న్న..గా, కదలకుండా నడుస్తున్నాడు.

గేటు వద్ద ఆగి లోనికి రావాలా, వద్దా అని ఆలోచిస్తున్నాడు. నేను చూచి 'సత్యం... లోనికిరా' అంటూ కేకేసాను లోపల్నుండే. నా మాట అతన్ని చేరినట్టు లేదు. అటూ, ఇటూ తిరుగుతూ ఏదో ఆలోచిస్తూనే వున్నాడు. 'లోనికి రా సత్యం' అంటూ నేనే బయటకు వొచ్చి మళ్ళీ పిలిచాను. వేరే లోకం నుండి అపుడే బయటకు వొచ్చిన వాడిలా తలతిప్పి చూసాడు.

తలకిందికేసి నేలవైపే చూస్తూ చి..న్న..గా నడుస్తున్నాడు. అడుగులో అడుగేసుకుంటూ నడుస్తూ వొచ్చి ఏదో అడ్డమొచ్చిన వాడిలా గుమ్మం దగ్గరే ఆగాడు. 'లోనికి రా, అక్కడే ఆగావే?" అన్నాను సత్యాన్ని లోనికి పిలుస్తూ. శబ్దం లేకుండా వొచ్చి నిలబడి నేల చూపులు చూస్తున్నాడు. స్టూలు ఇచ్చి కూర్చోమన్నాను. చూపుల్ని నేలవైపే తప్ప, తలపైకెత్తడం లేదు. 'ఏమయ్యింది తమ్మీ... అలా వున్నావేం?' సౌమ్యంగా ప్రశ్నించాను. ఎంతకీ తలపైకెత్తలేక పోతున్నాడు. నేను చిన్నగా రెండడుగులు ముందుకేసి సత్యం దగ్గరకెళ్ళి వీపుపై చేయివేసాను. నెమ్మదిగా తలపైకెత్తాడు. గుండెలో ఆవేదనేదో కళ్ళల్లో చేరిందనుకుంటా కళ్ళు దీనంగా వున్నాయి. ఇంటివద్ద ఎవరో అప్పుల్ని పోగొట్టుకున్నవాడిలా ముఖమంతా జాలిగా వుంది. జుట్టంతా చిందర వందరగా వుంది.

'ఏమయ్యింది తమ్మీ... అలా వున్నావేం?' వీపుపై చేయి వుంచే ప్రశ్నించాను. సమాధానం లేదు. తలపైకెత్తి నిల్చున్న నావైపే చూస్తున్నాడు. కనిపించీ... కనిపించని ఒక సన్నని నీటిపొర కళ్ళల్లోకి వచ్చింది సత్యానికి.

'చెప్పవేం తమ్మీ... ఏమయ్యింది... నాక్కూడా చెప్పవా?" అన్నాను.

కంటిలో ఇంతకు ముందు కనిపించిన నీటిపొర కొంచెం పెరిగినట్టుంది. గొంతులోనుండి మాటలు పెగలడం లేదు. పెదాలు అటూ, ఇటూ వణుకుతున్నాయి.

"అన్నా... పొద్దున అశోక్‌నగర్‌కు పోయిన... శిరీషమ్మ గారిని బట్టలేయమంటే, వాసింగ్‌మిషన్ దెచ్చుకున్నం రేపట్నుంచి నువ్వు రాగాకురా సత్యం అంది. పద్మమ్మ గారింటికి పోయినా అదే మాటంది" అనిచెప్పి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

నేను ఎంత బ్రతిమలాడి ఓదార్చుతున్నా అవేమీ సత్యానికి వినిపించడం లేదు. అలా ఏడుస్తూనే 'అట్లనే సుందర్‌నగర్‌ల గూడా రోహిణమ్మ గారూ, మంజులమ్మ గారూ వాసింగ్ మిషన్ దెచ్చిర్రంట' చెపుతూనే ఏడుస్తున్నాడు. సత్యం గుండె సంద్రంలో దుఃఖం అలలు అలలుగా పైకెగసి పడుతూ వుంది. సత్యం మనసునిండా కుండపోతగా కురుస్తున్న దుఃఖ వర్షాన్ని ఆపేందుకు నా దగ్గర ఏ మాటల గొడుగులూ సరిపోవడం లేదు.

బాలశ్రామికుడింకొకడు ఆరోజటి పేపరసరేశాడు. ఆ పేపర్ మడతలోంచి అందులో దూర్చిన స్థానిక కరపత్రం విడిగా జారిపడింది.

"పండుగ ధమాకాసేల్... ఫలాన్‌ఫూల్ వారి వాషింగ్‌మెషన్ సేల్ ధమాకా... సులభవాయిదాల్లో చెల్లింపు... మొదటి వాయిదాకే మీ ఇంట్లో బట్టలుతికే కరెంట్ యంత్రం. ఈ రోజు సుందర్‌నగర్‌లో మీ ఇంటి ముందుకే వచ్చే మొబైల్ సేల్ ధమాకాలో మీ పేరు నమోదు చేసుకోండి" ఆ కరపత్రం ఇళ్ళల్లోకి ఇస్త్రీసత్యం ఖాళీచేతులలో బయటకు...

ఆ రోజు నుండి సత్యం, చీకటి మబ్బుల చాటున చంద్రునిలా ఆందోళనగా వుంటున్నాడు. ఇంతకుముందు హుషారు లేదు. సత్యాన్నిపుడు చూడాలంటే నాకూ బాధగానే వుంటుంది.

రిటైర్‌మెంట్‌కు దూరం

అంపశయ్యనవీన్

“బొత్తిగా కనిపించడం లేదు. యేమైపోయావు?”

“యేమీ కాలేదు... బాగానే ఉన్నాను”

‘‘నిన్ను చూస్తేనే తెలుస్తున్నది... బాగానే ఉన్నావని. ఉద్యోగ విరమణ చేశావుగా... కాబట్టి తప్పకుండా బాగానే ఉంటావు”

“ఉద్యోగ విరమణ చేస్తే బావుండాలనే ముంది?”

“ఉద్యోగం చేస్తున్నప్పుడు చాలా టెన్షన్స్ ఉంటాయి గదా... కరెక్ట్ టైమ్‌కు ఆఫీసుకు వెళ్ళాలన్న తొందర... ఆఫీసులో ఫైళ్ళతో కుస్తీపట్టడం... కొన్ని పనులు చేస్తే ఒక సమస్య... చెయ్యకపోతే ఒక సమస్య. ఆఫీసర్ యేమంటాడోననీ... ఇవన్నీ మనకు చాలా టెన్షన్స్‌ని సృష్టిస్తాయిగదా... ఉద్యోగ విరమణ చేసి రిటైర్‌య్యామంటే యే టెన్షన్స్ లేకుండా హాయిగా ఉండొచ్చు. మనకు ఇష్టమైనట్టుగా జీవించవచ్చు. మనకు సంపూర్ణస్వేచ్ఛ లభిస్తుంది. నీకు పుస్తకాలంటే చాలా ఇష్టం కదా... స్టూడెంట్ డేస్‌లో పుస్తకాలు బాగా చదువుతుండేవాడివి. ఉద్యోగంలో చేరాక పుస్తకాలకు దూరమైపోయానని చాలా బాధ పడ్తుండేవాడివి. రిటైరయ్యాక హాయిగా పుస్తకాలు చదువుకుంటూ, సంగీతం వింటూ గడుపుతాను అంటుండేవాడివి... ఇప్పుడాపనే చేస్తున్నావనుకుంటాను”

“అంత అదృష్టం మనకెక్కడిదిలే.”

“అదేమిటి... రిటైర్‌య్యాక యేం చెయ్యాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది కదా... దీనికి పెద్ద అదృష్టం కావాలా?”

“మీలాంటి వాళ్ళు అలా మీకిష్టమైనట్టుగా ఉండగల్గుతారు. కానీ నాలాంటివాళ్ళు ఉండలేరు”

“ఎందుకుండలేరు?”

“రిటైరయ్యాక కూడా యేదో ఒక ఉద్యోగం చెయ్యక తప్పడం లేదు. నేనో ప్రైవేట్ కాలేజీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా చేరాను”

“నీకు మళ్ళీ ఉద్యోగంలో చేరాల్సిన అవసరం యేమొచ్చిందయ్యా బాబూ! ఇద్దరి బిడ్డల పెళ్ళిళ్ళు చేసేశావు. ఇద్దరు కొడుకులకు ఉద్యోగాలు దొరికాయి. వాళ్ళ పెళ్ళిళ్ళు కూడా చేసేశావు. నీకొచ్చే పెన్షన్‌తో నువ్వూ మీ ఆవిడ హాయిగా బతకొచ్చుకదా...”

“బతకొచ్చుననుకోండి...”

“నీకు నెలకు తొమ్మిదివేల దాకా పెన్షన్ వస్తుందికదా”

“వస్తుంది...”

“తొమ్మిదివేలతో ఇద్దరు మనుషులు హాయిగా బతకలేరంటే నేను నమ్మలేను. నీకు స్వంత ఇల్లు కూడా ఉంది...”

“ఉందనుకోండి...”

“మరి మళ్ళీ ఉద్యోగం ఎందుకు చేస్తున్నట్టు?”

“ఎప్పుడూ ఇంట్లో కూర్చుంటే టైమ్ ఎలా గడుస్తుంది?”

“టైమ్ గడవడం పెద్ద సమస్యా? నీకు పుస్తకాలు, మాగ్‌జైన్స్ చదివే అలవాటుంది. ఆ పని చెయ్యొచ్చు. లేదా బోలెడు స్వచ్ఛంద సంస్థలున్నాయి... వాటిల్లో చేరి సామాజికసేవ చెయ్యొచ్చు...”

“పుస్తకాలు ఒకప్పుడు బాగానే చదివేవాన్ని... కానీ ఇప్పుడంత ఓపిక లేదు. వాళ్ళు పేజీలు చదవగానే ఆవలింతలొస్తున్నాయి. ఇక సమాజ సేవంటారా... అది నాతో అయ్యేపని కాదులెండి”

“యేం? ఎందుకు కాదు?”

“సమాజసేవ చేస్తే యేమొస్తుంది?”

“అదే అసలు విషయం... యేదో వస్తే తప్ప మనం యేం చెయ్యమన్నమాట...”

‘‘అంతేకదండి... ఖర్చులు పెరిగిపోతున్నాయికదా. ఇంట్లో టీ.వీ ఉండె. సీ.డి. ప్లేయరుండే... ఫ్రిజ్ ఉండె... ఈ మధ్యనే ఏ.సి కూడా పెట్టించు కుంటిమి. ఇవన్నీ పెట్టించుకునేటప్పటికి బోల్డు కరెంట్‌బిల్లు వస్తుండె. ఇంట్లో ఫోనుండె... మా ఆవిడ ఎప్పుడూ ఫోన్లు చేస్తుంటుంది. రోజుకు ఐదారు సార్లయినా హైదరాబాద్‌లో ఉంటున్న మా ఇద్దరు బిడ్డలకు ఫోన్ చేసి మాట్లాడుతుంది. మనుమలు, మనవరాళ్ళతో మాట్లాడుతుంది. మా కొడుకులిద్దరూ ఒకడు ఢిల్లిలోనూ, ఇంకొకడు విశాఖపట్నంలోనూ ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ళతో కూడా రోజుకొకసారైనా మాట్లాడు తాం... దీంతో బోల్డు టెలిఫోన్ బిల్లు... నాకొచ్చే పెన్షన్ డబ్బులు కరెంట్ బిల్లులూ, టెలిఫోన్ బిల్లులు చెల్లించడానికే సరిపోవడంలేదు. నెలంతా ఎలా గడపాలంటారు?”

“ఇప్పుడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంత సంపాదిస్తున్నారేమిటి?”

“ఓ పదివేలిస్తున్నారు... ఇదీ పెన్షన్ కలిస్తే ఉద్యోగం చేస్తున్నప్పుడెంత సంపాదిస్తున్నామొ అంత సంపాదించగల్గుతున్నాను. అందువల్ల అప్పుడు ఏ స్థాయిలో జీవించామొ ఇప్పుడు కూడా అదే స్థాయిలో జీవించగల్గుతున్నాను...”

“నువ్వేకాదు... రిటైరైన చాలామంది నీలాగే మళ్ళీ ఉద్యోగాలు చేస్తున్నారు. హాయిగా స్వేచ్ఛగా ఉండక మళ్ళీ ఉద్యోగాలెందుకు చేస్తున్నారని అడిగితే నువ్వు చెప్పిన సమాధానమే చెబుతున్నారు. నాకు ఆశ్చర్యం కల్గించే విషయమేమిటంటే ఈ రోజుల్లో రిటైరైన వాళ్ళెవరూ ఇంట్లో కూర్చోవడం లేదు. యేదో ఒక ఉద్యోగంలో మళ్ళీ చేరుతున్నారు. నాకు చాలామంది లెక్చరర్లు తెలుసు... వాళ్ళల్లో చాలామంది రిటైరయ్యాక కూడా యేదో ఒక ప్రైవేట్ కాలేజిలో మళ్ళీ జాయినవుతున్నారు. ప్రిన్స్‌పాల్స్‌గా రిటైరయిన వాళ్ళు మళ్ళీ యేదో ఒక ప్రైవేట్ కాలేజిలో ప్రిన్స్‌పాల్స్‌గా చేరుతున్నారు. కొందరైతే ప్రభుత్వోద్యోగం చేస్తున్నప్పటి కంటె రిటైరైయ్యాకే ఎక్కువ బిజీగా ఉంటూ ఎక్కువ పని చేస్తున్నారు. అప్పుడెంత సంపాదించారో అంతకంటె ఎక్కువే సంపాదిస్తున్నారు. ఒకప్పుడు ఉద్యోగ విరమణ చెయ్యడం అంటే ఎంతో బాధాకరమైన విషయంగా పరిగణించే వాళ్ళం. రిటైరైనవాడిని సమాజం చాలా చులకనగా, ఇక ఎందుకూ పనికిరాని వాడన్నట్టుగా చూసేవాళ్ళు. అతని భార్యా, పిల్లలు కూడా అతన్ని నిర్లక్ష్యం చేసేవాళ్ళు. దీంతో రిటైరైనవాళ్ళు విపరీతమైన



ఆత్మన్యూనతా భావానికి లోనయ్యేవాళ్ళు. కానీ ఇప్పుడా పరిస్థితి మారింది.

“ఎందువల్లనంటారు?”

“రెండు మూడు కారణాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు రిటైరౌతున్నవాళ్ళ ఆరోగ్య పరిస్థితి చాలా బాగుంటున్నది. 58 యేళ్ళొచ్చినా, 60 యేళ్ళొచ్చినా ఆరోగ్యంగానే ఉంటున్నారు. పనిచేసే శక్తి సన్నగిల్ల డంలేదు. రెండో కారణమేమిటంటే ఈనాడు ప్రైవేట్ సంస్థలు బాగా పెరిగిపోయాయి. దాంతో రిటైరయిన వాళ్ళలో కొంతమందికి మళ్ళీ ఉద్యోగాల్లో చేరే అవ కాశాలు పుష్కలంగా యేర్పడ్డాయి. మూడో కారణ మేమిటంటే ఇవ్వాళ మధ్యతరగతి కుటుంబాల్లో విలాస వస్తువుల వాడకం బాగా పెరిగిపోయింది. దీన్నే ‘కన్స్యూమరిజం’ అంటున్నారు. దీంతో ఎంత డబ్బైనా సరిపోవడం లేదు. వీటన్నింటితోపాటు ఈనాడు ఎవర్ని చూసినా అవసరం ఉన్నా లేకపోయినా బాగా సంపాదించాలనే పిచ్చి ముదిరిపోతున్నది.”

పారిన పథకం

పెండెం జగదీశ్వర్

గురునాథం పట్నంలోని ఓ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. తనకొచ్చే కొద్దిపాటి జీతంతో భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తూ అద్దె ఇంట్లో వుంటున్నాడు. పొదుపుగా జీవితాన్ని సాగిస్తున్నాడు.

గురునాథం దూరపు బంధువు రాజయ్య. అతను పల్లెటూర్లో వుంటాడు. ఒకరోజు పని మీద పట్నం వచ్చాడు. బజార్లో గురునాథానికి ఎదురయ్యాడు. రాజయ్య గురునాథానికి వరుసకు పెద్దనాన్న అవుతాడు. ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నాక "మా ఇంటికి రండి పెద్దనాన్నా! భోజనం చేద్దురు" అని ఆహ్వానించాడు గురునాథం. రాజయ్య 'సరే' అని అతనితో నడిచాడు. రాజయ్యను ఆ రోజు వెళ్ళనీయకుండా ఆపి అతిథి మర్యాదలు చేశాడు.

మరునాడు ఉదయం రాజయ్య తిరిగి వెళ్లేటప్పుడు "మీరు ఈ ఊళ్లోనే వుంటున్న సంగతి నాకు తెలియదు. నేను తరచూ పనుల మీద పట్నం వస్తూనే వుంటాను. ఇక్కడ మీరు వుండడం నాకు చాలా సంతోషంగా వుంది'' అని వెళ్లిపోయాడు. నాలుగు రోజులు గడిచాయి. రాత్రి పూట దుకాణం నుండి ఇంటికి వచ్చిన గురునాథానికి రాజయ్య కనిపించాడు.

'బాగున్నారా!' అని పలకరించాడు గురునాథం. ''ఎరువులు కొందామని వచ్చాను. చీకటి పడింది. అందుకే ఇలా వచ్చాను'' అన్నాడు రాజయ్య నవ్వుతూ. 'దాందేముందిలెండి' అని ఆ రోజు కూడా మర్యాదలు చేశారు గురునాథం దంపతులు. మరో వారం తిరక్కముందే రాజయ్య మరోసారి వాళ్లింటికి వచ్చాడు. "ధాన్యం అమ్మడానికి వచ్చాను. పని పూర్తయింది. మిమ్మల్ని కలిసి వెళ్దామని వచ్చాను' అని ఆ రోజు రాత్రి అక్కడే వున్నాడు. ఆ తర్వాత రాజయ్య వారానికోసారి వాళ్లింటికి వస్తూనే వున్నాడు. మొదట్లో ఏమనిపించకపోయినా రానురాను రాజయ్య రాక గురునాథం దంపతులకు ఇబ్బంది కలిగించింది. మొహమాటానికి ఏమీ అనలేకపోయారు. తిరిగి వెళ్లడానికి బస్సు సౌకర్యం వున్నప్పటికీ రాజయ్య తమ ఇంటికి వస్తుండడం గమనించాడు గురునాథం. ఏదో ఒకటి చెయ్యకపోతే పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని అనుకున్నాడు. ఒక ఉపాయం ఆలోచించాడు.

అతను ఓ రోజు పొద్దున్నే రాజయ్య ఊరికి బయలుదేరాడు. తన ఇంటికి వచ్చిన గురునాథానికి మర్యాదలు చేశాడు రాజయ్య. రెండు రోజుల తర్వాత ఓ సాయంత్రం మళ్లీ రాజయ్య ఇంటికి వెళ్లాడు గురునాథం. "ఈ ఊళ్లో మంచి పచ్చడి మామిడికాయలు దొరుకుతాయని తెలిసింది. అందుకే వచ్చాను" అన్నాడు. మరో వారం తర్వాత "మీ ఊళ్లో ఎవరి పాలమన్నా అమ్మకానికి దొరుకుతుందా?" అనే సాకుతో వెళ్లి ఆ రాత్రికి అక్కడే వుండిపోయాడు. నెలరోజుల వ్యవధిలో ఏడెనిమిది సార్లు ఏదో ఒక వంకతో రాజయ్య ఇంటికెళ్లి రాత్రి పూట వుండి మర్నాడు తిరుగు ప్రయాణం అయ్యాడు గురునాథం. దాంతో రాజయ్యకు తాను చేసిన పొరపాటేంటో తెలిసింది. తాను పలుసార్లు గురునాథం ఇంటికి వెళ్లి, వాళ్లను ఇబ్బంది పెట్టిన విషయం గుర్తొచ్చి సిగ్గుపడ్డాడు. తనకు గుణపాఠం చెప్పడానికే గురునాథం ఇలా చేసి వుంటాడని భావించాడు. బంధువుల ఇంటికి ఎప్పుడో ఒకసారి మర్యాద కోసం వెళ్లాలే తప్ప చీటికీమాటికీ వెళ్లడం సంస్కారం అనిపించుకోదని అనుకున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఏ బంధువుల ఇంటికి వెళ్లకూడదని ఆ క్షణమే నిర్ణయించుకున్నాడు. తన పథకం పారినందుకు గురునాథం ఎంతో సంతోషించాడు. రాజయ్య ఆ తర్వాత ఇంకెప్పుడూ అనవసరంగా వాళ్ల ఇంటికి వెళ్లి ఇబ్బంది పెట్టలేదు.



చిన్నారి చిత్రకారులు



పి.సందీప్, 8వ తరగతి,
లిటిల్ బడ్స్ హైస్కూల్, వనస్థలిపురం, హైదరాబాదు.

ఎం.మౌనిక, 5వ తరగతి,
లిటిల్ బడ్స్ హైస్కూల్, వనస్థలిపురం, హైదరాబాదు.

జె.మానస, 4వ తరగతి,
సెయింట్ పాయిస్ టెన్త్ గరల్స్ హైస్కూల్,
రాంనగర్, హైదరాబాదు.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

హేయ్! ఈ వారం మీ ముందుకు వచ్చిన తాతయ్య ఎవరో ఈపాటికే మీ చిట్టి బుర్రలో వెలిగే వుంటుంది. ఆయన రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడు. మరి వెంటనే కార్డుమీద రాసి మాకు సంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు:
అమ్రేష్‌పురి

__సరైన సమాధానాలు రాసినవారు__

ఎ.ఆనందరావు, 9వ తరగతి, మంగొల్లు. కె.సరిత, 9వ తరగతి, ఎస్.లక్ష్మి (ఇంద్ర), కె.నరేష్ సాగర్, 9వ తరగతి, జి.లక్ష్మణ్, 10వ తరగతి, జి.తేజ, 6వ తరగతి, వనపర్తి. కె.శ్రీఅనూహ్య, 6వ తరగతి, గుంటూరు. పి.రాజేష్, 10వ తరగతి, పి.స్వరూప, 9వ తరగతి, ఈమని. షహబాజ్ బాను, 7వ తరగతి, చందోలు. పి.వినోద్‌కుమార్, 7వ తరగతి, దేశినేనిపాలెం. వై.శ్రావణి, 6వ తరగతి, గాదెపాడు. ఎ.హేమంత్, 9వ తరగతి, దామరమడుగు. ఎం.అవినాష్, 7వ తరగతి, కంచరాం. ఎం.జయభాను, 4వ తరగతి, దర్శి. డి.రేవతిపతి, 9వ తరగతి, టెక్కలి. ఎన్.మధుమిత, 9వ తరగతి, మహబూబాబాద్. వి.సౌమ్య, 7వ తరగతి, ఠాగూర్ విద్యాలయం, వైరా, ఖమ్మం. ఐ.ఆర్.జయలక్ష్మి 5వ తరగతి, విద్యానగర్, హైదరాబాదు. జి.మాధవి, 8వ తరగతి, ప్రజ్ఞ గ్రామర్ స్కూల్, వనపర్తి, మహబూబ్‌నగర్. కె.చరిత, 5వ తరగతి, సెయింట్‌పాయిస్ గరల్స్ హైస్కూల్, రామ్‌నగర్, హైదరాబాదు.

❄

దారి కనుక్కోండి

హేయ్ పిల్లలూ...! కింద గజిబిజి దారులు కొన్ని వున్నాయి కదా. వాటి మధ్యలో బోలెడన్ని తినుబండారాలు వున్నాయి. బెలూన్ దగ్గర బయలు దేరి ఫ్రిజ్ దగ్గరకు వెళితే అందులో వున్న వాటిని తినొచ్చు. తర్వాత పాన్ మీద వేడి వేడిగా తయారౌతున్న ఆమ్లెట్ దగ్గరకెళ్లి దాన్నీ గుటకాయస్వాహా చేయొచ్చు. ఇంక చివరిగా పళ్ల బుట్ట దగ్గరకెళ్లి అవన్నీ ఆరగించొచ్చు. మరి దారులు కనిపెట్టండి.

❄



ఏవి పెద్దవి?



చిన్నారులూ! మాకు ఓ తాతయ్య, మనవరాలు తెలుసు. వాళ్లు ఓసారి రెండు ఫొటోలు దిగారు. వాటిని మాకు పంపారు. వాటితోపాటు ఓ ప్రశ్నకూడా పంపారర్రా! అదేంటంటే... 'ఈ రెండు ఫొటోలు బాగా చూడండి. చూసి మా మొహాలు ఎందులో పెద్దగా వున్నాయో చెప్పుకోండి?' అని.

వి'చిత్రం'

నేస్తాలూ ఇవాల్టి వి'చిత్రం' ఇదే. మరి మీరు బాగా పరిశీలనగా చూసి జవాబు చెప్పి మన సత్తా ఏంటో నిరూపించుకోవాలి. ఓకేనా! ఏంటి మీరు కూడా నీరసంగా చూస్తున్నారు? మీకూ జవాబు తెలీలేదా? అయితే పేజీ తిరగేసి మా సమాధానం చూడండి. ఓకేనా!

జవాబు

పిల్లలూ! సమాధానం కోసం మీరంతా పాపం చాలాసేపు ఆలోచించినట్టున్నారే. విషయం ఏంటంటే... తెల్లగా వున్న మొహాలు నల్లగా వున్న వాటికంటే కాస్త పెద్దగా కనిపిస్తాయి. కానీ అవి రెండూ ఓకే సైజులో వున్నాయి. కావాలంటే స్కేలుతో కొలిచి చూడండి. ❋

చాప కావాలా!









ఫ్రెండ్స్! మీ ఇంట్లో చాప వుందా!! అయినా చాప లేకుండా ఎలా వుంటుంది లెండి. మరి మీకు అలాంటి చాపను కాగితాలతో అల్లడం వచ్చా! రాదా? అయితే ఇవాళే... ఇప్పుడే దాన్ని ఎలా చెయ్యాలో చెప్పేనుకుందాం. జాగ్రత్తగా చదివి చేసెయ్యండి.

ఏమేం కావాలంటే... మందపాటి చార్టు, రంగురంగుల కాగితాలు, చాకు, పెన్సిల్, గమ్.

ఎలా చెయ్యాలంటే... ముందుగా మీరు పొడవు వెడల్పులు సమానంగా (20 × 20సెంమీ) వున్న చార్టు తీసుకోండి. దానిమీద ఒకటవ బొమ్మలో చూపించినట్టుగా గీతలు గీసుకోండి. అవి పైన వెడల్పుగా కిందకొచ్చేసరికి సన్నగా వుండాలి. సమాంతరంగా వుండకూడదు. తర్వాత వాటిని చాకుతో కత్తిరించండి(2వ బొమ్మ). తర్వాత రంగు కాగితాల నుంచి సమానమైన పొడవు, వెడల్పులు గల పీసులను కత్తిరించిపెట్టుకోండి (3వ బొమ్మ). వాటిని 4వబొమ్మలో చూపించినట్టుగా దూర్చండి. పూర్తిగా అల్లడం అయ్యాక చివర్లను మడిచి గమ్‌తో అతికించండి. అంతే చాప రెడీ. దీన్ని గోడకు తగిలిస్తే సూపర్‌గుంటుంది. ❋

ఎన్ని పెన్సిళ్లున్నాయి?



నేస్తాలూ..! పక్కన బొమ్మలో కొన్ని పెన్సిళ్లున్నాయి కదా. అవి ఎన్నో చెప్పుకోండి చూద్దాం. ఏంటి? అలా పెట్టారు మొహం. సరిగ్గా చూసి చెప్పండి. ఏంటీ? నాలుగు వున్నట్టు కనిపిస్తున్నాయా? అలా అన్నారంటే తప్పులో కాలేసినట్టే. పెన్సిల్ అంటే పాయింట్ దగ్గరనుంచి చివరి వరకు కనిపించాలి కదా. మరి నాలుగు పెన్సిళ్లకూ అలా కనిపించడంలేదు కదా. అందుకని అక్కడ నాలుగు లేవు. రెండే వున్నాయి. అవునా!

మీకూ పేపర్ బొమ్మలు చెయ్యడం వచ్చా?

ఫ్రెండ్స్! మీకు ప్రతివారం పేపర్‌తో బొమ్మలు చెయ్యడం నేర్పిస్తున్నాం కదా. మరి ఇలాంటివి మీకూ ఏమైనా వచ్చా? ఏయ్! వచ్చే వుంటాయి. మరైతే వెంటనే కార్డు తీసుకుని వివరంగా రాసి మాకు పంపండి. ఎంచక్కా మీ పేరు, తరగతి, ఊరుతో సహా ప్రచురిస్తాం. మా చిరునామా: **పేపర్ బొమ్మలు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు. ❋

సువర్ణం

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

రోడ్డుపైన లారీ మెత్తగా దూసుకుపోతోంది.

వాహనాల రద్దీ అంతగా లేకపోయినా రోడ్డు గతుకులమయంగా ఉండటం వల్ల డ్రైవర్ జాగ్రత్తగా నడుపుతున్నాడు.

నల్గొండ జిల్లాలో చౌటప్పల్ నుంచి చండూరుకి వెళ్లేదారి.

ఆ రూటులో బస్సులు తక్కువ ఉంటాయి.

ప్రయాణీకులు ఎక్కువగా ఆటోలపైన ప్రైవేటు వాహనాలపైన, లారీలపైన ప్రయాణిస్తుంటారు. గమ్యస్థానం చేరడానికి ఏ మార్గమైన పర్వాలేదని, చార్జీ తక్కువని ప్రయాణీకులు లారీల కోసమే ఎదురు చూస్తుంటారు.

లారీలు ఏ సమయంలో అయినా దొరుకుతాయి. బస్సుచార్జీలు కన్నా తక్కువ. అందుకే ఎక్కువమంది లారీలను ఆశ్రయిస్తుంటారు.

ప్రసాద్ స్కూటర్ పాడైంది.

రోజూ వెళ్లే రహదారి అయినా లారీని ఆశ్రయించవలసి వచ్చింది. చెయ్యి ఎత్తగానే లారీ ఆపుచేశాడు డ్రైవరు. వెంటనే ఎక్కి కేబిన్‌లో కూర్చున్నాడు. లారీ బయలుదేరింది. రోడ్డుపక్క జంక్షన్‌లలో ఎవరైనా ఎక్కుతారేమోనని క్లీనర్ ఆశగా పరిసరాలను గమనిస్తున్నాడు. అంతకుముందే ఆటో ఒకటి వెళిపోవడంతో ప్రసాద్ తప్ప ఇతరులెవరూ ఎక్కలేదు.

లారీ నెమ్మదిగా వెళుతోంది.

"ఎక్కడికి వెళ్లాలి!" డ్రైవర్ ప్రశ్నించాడు.

"సంస్థాన్ నారాయణపూర్ వెళ్లాలి. దిగాక మరో ఆటో ఏదైనా చూసుకుంటాను!" అన్నాడు.

క్లీనరు డబ్బులు కావాలంటూ చేతులు చూపాడు.

ప్రసాద్ జేబులో చెయ్యి పెట్టి పది రూపాయల నోటు అందించాడు. దానిని తీసుకుని షర్టు జేబులో పెట్టుకున్నాడు.

వాతావరణం వేడిగా ఉంది.

సాధారణంగా అటువంటి సమయాల్లో లారీని ఏ చెట్టుకిందో ఆపి కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. లేదా రోడ్డుపక్క హోటల్‌వద్దో దాబావద్దో, ఆపి భోజనాలు కానిస్తారు. లారీలో ఎక్కిన ప్రయాణీకుల నుంచి వచ్చిన డబ్బులనే భోజనాలకు వెచ్చిస్తుంటారు.

"యాదగిరీ ఆకలయిత లేదా?" డ్రైవర్ ప్రశ్నించాడు.

క్లీనరు జవాబు చెప్పకుండా కిటికీలోంచి పక్కకు చూస్తుండిపోయాడు. తర్వాత నెమ్మదిగా "అదే హోటల్ ఏదైనా కనిపిస్తుందేమో చూస్తున్నాను" అన్నాడు.

ప్రసాద్ ముభావంగా ఉండిపోయాడు.

అతనికి కూడా ఆకలిగానే ఉంది. తొందరగా ఇంటికి వెళ్లాలని అనుకున్నా కుదరడం లేదు. లారీ సిబ్బంది భోజనాలకు ఆగారంటే మరో అరగంట ఆలస్యం అవుతుంది. ఎప్పటికి వెళ్లగలనో అనుకున్నాడు.

ఇంతలో వెనుక చక్రంలో టైరు గాలి పోతున్న విషయాన్ని డ్రైవర్ గమనించాడు. మరో అరగంటలో మొత్తం గాలి ఖాళీ అవుతుంది. స్టెఫినీగా ఉండవలసిన టైరు కూడా లేని విషయం గుర్తుకు వచ్చింది.

"యాదగిరీ! టైర్లో గాలి లీకవుతోంది. ఇక్కడ పేచీ చేయడానికి షాపులున్నాయి కదూ?" ప్రశ్నించాడు.

"ఈ రూటులో టైర్లను మార్చడం పేచీ చేయడం వంటి పనులు జరుగుతుంటాయి. ఎక్కడో గుర్తుకు రావడం లేదు. మరో అరగంట లోపు షాపు కన్పించకపోదు. త్వరగా పోనీ..." సూచించాడు.

లారీ కాస్త స్పీడు అందుకుంది.

లారీ సిబ్బంది మాటలు విని ప్రసాద్ ఇప్పటికే ఆలస్యం అయిందని అనుకుంటుంటే ఈ పేచ్ వల్ల మరింత ఆలస్యం అవుతుందని నిర్ణయించుకున్నాడు. ఇలా అయితే మరో రెండు గంటలకు కాని ఇంటికి చేరలేనేమో అనుకున్నాడు.

ఇంతలో లారీ రోడ్డుపక్క పూరిగుడిసె ముందు ఆగింది. డ్రైవర్ ఇంజన్ ఆపకుండానే క్లీనర్ యాదగిరి కిందకు దిగి గుడిసెలోకి దూరి బైటికి వచ్చాడు. "పేచ్‌లు చేస్తారట...ఇంజన్ ఆపు!" అన్నాడు.

లారీ ఆపుచేసి డ్రైవర్ కిందికి దిగాడు.

ఆ ఇంటిముందు పాతటైర్లు కుప్పలుగా ఉన్నాయి.

గాలి పంపు చేసే మిషన్ ఉంది. ఇతర సామాన్లు కూడా ఉన్నాయి.

ఇంతలో గుడిసెలోంచి ఒక ఆవిడ బైటికి వచ్చింది.

వయస్సు ముప్పయి సంవత్సరాలకు అటుఇటుగా ఉంటుంది. మాసిపోయిన ముతకచీర కట్టుకుంది. చేతులు మురికిగా ఉన్నాయి. "అరగంట అవుతుంది!" అంది బైటికి రావడంతోనే.

డ్రైవర్ క్లీనరు పక్కనున్న కర్ర బెంచీపై కూలబడ్డారు. ఉదయం నుంచి అన్నీ ఇటువంటి సంఘటనలే జరుగుతున్నాయని డ్రైవర్‌కు విసుగ్గా ఉంది. గుడిసెలో నుంచి వచ్చినావిడ చేస్తున్న పనులను గమనించడం మొదలుపెట్టారు.

వెనుకటైరు కింద జాకీని అమర్చింది. కుర్రవాడిని పిలిచి జాకీని తిప్పుతూ మీదకు ఎత్తింది. లారీకి గట్టిగా బిగించిన టైరు బోల్టులను అతి కష్టంపైన విప్పింది. "సాయం చేసేదా?" యాదగిరి ప్రశ్నించాడు. ఆమె ఏమి జవాబు చెప్పకుండా తన పనిలో మునిగిపోయింది.

క్లీనర్ యాదగిరి డ్రైవర్ వైపు తిరిగి– "రా గురూ! ఆకలి దంచేస్తోంది. భోజనం చేద్దాం!" అని ప్రసాద్‌తో "ఏమండీ! మరో గంటా అరగంటా ఆలస్యం అవుతుంది. అర్జంటు అయితే ఎందులోనైనా వెళ్ళిపోండి!" అని డ్రైవర్‌ను తీసుకుని దూరంగా కనిపిస్తున్న పాకహోటల్ వైపు దారితీసాడు.

ప్రసాద్‌కి అంతా ఆశ్చర్యంగా ఉంది.

లారీలకు టైర్లు విప్పడం చాలా కష్టమైన పని. దానిని పురుషులు కూడా సులభంగా చేయలేరు. అటువంటిది ఒక స్త్రీ ఈ పని చేయడం ఎంతో ముచ్చట వేసింది. విస్మయం కూడా కలిగించింది.

ఆమె చేస్తున్న పనిని గమనిస్తూ అక్కడే కూర్చుండిపోయాడు. భోజనం చేయాలని కూడా అనిపించలేదు.

* * *

నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలంలో జనగాం చిన్న పల్లెటూరు. అమాయకత్వానికి ప్రతిరూపంగా ఏర్పుల సువర్ణ పేదరికంలో పుట్టింది. పేదరికంలో పెరిగింది. పేదరికాన్నే పెళ్లాడింది.

చిన్నతనం నుంచి వ్యవసాయకూలిగానే ఉంది.

ఇంటిలో అందరితో కలిసి కూలికి వెళ్లడం, వచ్చిన డబ్బులతో కలో గంజో తాగడంతో జీవితం సాగని నావలా తయారైంది. ఎంత కష్టపడుతున్నా ఫలితం కనిపించేది కాదు. చిన్నతనంలో పేదరికం కారణంగా

తల్లిదండ్రులు చదివించలేదు. కూలి పని తప్ప మరి యే ఇతర పనులు చేయడానికి చేతకాలేదు.

ఆ సమయంలో ఆమెకు వివాహం అయింది.

అదే గ్రామానికి చెందిన నారాయణ అనే కూలి ఆమెకు భర్తగా లభించాడు. ఇద్దరి పరిస్థితి ఒకేలా ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రందాకా విపరీతంగా కష్టపడేవారు. వచ్చిన సొమ్ముతో కొంతలో కొంత సుఖంగా బతికేవారు.

సువర్ణ పొలం పనుల్లో కూలికి వెళ్లేది.

అక్కడ యజమానులు ట్రాక్టర్లను ఇతర వాహనాలను ఎక్కువగా వినియోగించేవారు. ఆ వాహనాలు తరచూ మరమ్మతులకు గురికావడం, ట్యూబులు పేలిపోవడం వంటివి జరిగేవి. దూర ప్రాంతాల నుంచి మెకానిక్‌లను రప్పించి పనులు చేయించేవారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒకటి రెండురోజులు పనులు ఆగిపోయేవి.

ఆ సమయంలో "ఇటువంటి పని నేర్చుకుంటేనో" అనిపించింది సువర్ణ మనసులో. ఈ విషయాన్ని భర్త నారాయణతో చెప్పింది. ఇది విని అతను ఆశ్చర్యపోయాడు. "నాకంటూ పర్మినెంటు కూలి పని ఉంది. దానిని వదిలి రాలేను! నువ్వు ఒక్కదానివే ఈ పని చేయలేవు. చాలా కష్టంతో కూడుకున్నది. అయినా ఆడవాళ్లు ఎవరూ ఈ పని చేయలేరు" నారాయణ అనునయించాడు.

"ఎందుకు చేయలేరు. కష్టపడి కృషి చేస్తే ఆడవాళ్లు కూడా ఏ పని అయినా చేయగలరు. ఈ పనిని మొదలుపెడితే ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుందని అనిపిస్తోంది!" సువర్ణ ధృఢంగా చెప్పింది.

ఆ తర్వాత భార్యాభర్తలు వారం పదిరోజులు ఈ విషయంలోనే తర్జన భర్జనలు పడ్డారు. తర్వాత ఒక నిర్ణయానికి వచ్చి సంస్థాన్ నారాయణపూర్‌లో మెకానిక్ షెడ్డు వద్దకి వెళ్లి ఈ పనులను గమనించింది. అక్కడ పనిచేసే కుర్రవాడిని సహాయకునిగా కుదుర్చుకుంది.

చౌటప్పల్ - చండూరు రహదారిలో రోడ్డుపక్క చిన్న పూరిగుడిసె వెలిసింది. గుడిసెముందు అవసరమైన సామాగ్రిని రప్పించింది. గాలి కొట్టడానికి మోటార్‌ను కూడా అప్పుచేసి కొంది. కొద్దిరోజులు ఎవరూ పట్టించుకోలేదు. తర్వాత తెలిసిన ట్రాక్టర్ల సిబ్బందితో చెబితే మొదట గాలి కొట్టించుకోవడానికి వచ్చేవారు. క్రమ క్రమంగా టైర్లు మార్చడం, ట్యూబులకు పేచీలు చేయడం వంటి పనులు ప్రారంభమయ్యాయి. మొదట్లో మెకానిక్ కుర్రవాడు సహాయకంగా ఉండటం వల్ల పనులు చేయడంలో కొంత వెసులుబాటు కలిగింది. క్రమంగా ఈ పనులు చేయడంలో అనుభవం గడించింది. జాకీ బిగించి నిమిషాల్లో టైరును విప్పడం, పేచ్ చేయడం సులభంగా వచ్చేసింది.

ఆపై నుంచి సువర్ణ మరి దేనికీ వెనకాడలేదు.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనిచేస్తే వంద రూపాయలకు తక్కువ కాకుండా ఆదాయం వస్తోంది. మెకానిక్ షెడ్డుగా అందరికీ తెలియడంతో చాలామంది వాహన ఛోదకులు ఆగుతున్నారు. వాహనాలు తిరిగే ప్రధాన రహదారి కావడంతో నిత్యం చేతినిండా పని ఉండేవిధంగా తయారైంది.

మహిళలు ఎవరూ ఆ గుడిసె పనిచేయలేరు, కష్టమైన పని అనిపించిన దానినే సువర్ణ సుసాధ్యం చేసింది. ఎంతో మందికి ఆదర్శప్రాయం అయింది.

* * *

మధ్యాహ్నం ఎండ దంచేస్తోంది.

ప్రసాద్‌కు ఆకలివేస్తున్నా భోజనం చేయాలని అనిపించలేదు. రోడ్డుపక్కనున్న కిళ్లీకొట్టు వద్దకు వెళ్లి ఒక వాటర్‌పేకెట్ కొనుక్కుని తాగాడు. మళ్లీ వచ్చి కర్ర బెంచిపైన చతికిలపడ్డాడు.

సువర్ణ చేస్తున్న పనిని గమనిస్తుండటంతో ప్రసాద్ మనసులో ఆలోచనలు మొదలయ్యాయి. చదువుకున్నా ఉద్యోగంరాని తన దుస్థితి గుర్తుకువచ్చింది. ఖర్చే తప్ప ఆదాయం లేకుండా కుటుంబానికి భారంగా తయారై దినదినగండంతో బతుకుల్ని వెళ్లదీస్తున్న దయనీయ పరిస్థితి కళ్లముందు మెదిలింది.

సువర్ణతో మాటల పరిచయం అయిపోయింది.

ఆమె చెప్పిన విషయాలు, ఈ పని చేయడానికి చేసిన కృషి, ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని ఒకలాంటి ఆనందం కలిగింది. సువర్ణను చూస్తుంటే చిన్నతనంలో తనను వేలు పట్టుకుని బడికి తీసుకువెళ్లి కూర్చోబెట్టి కిటికీలోంచి తను ఏమి చేస్తున్నానో గమనించే పెద్ద అక్క గుర్తుకు వచ్చింది.

"నువ్వు చదువుకోలేదేం?" ప్రశ్నించాడు.

చేస్తున్న పనిని ఆపి "నాకు చదువుకునే అవకాశం రాలేదు. ఆ పరిస్థితి మా ఇంటిలో కూడా లేదు. అందుకే మా ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నాను!" అంది.

"నిజంగా?"

"నిజం బాబూ! ఆ రోడ్డు మలుపులో కాన్వెంటు ఉంది. ఉదయాన్నే కేరేజీలు కట్టి సిద్ధంగా ఉంటే రిక్షా వస్తుంది. మళ్లా ఏ సాయంత్రమో వాళ్లు ఇంటికి వస్తారు. నాకూ పనికి అడ్డంకి లేదు. ఉదయం ఒక గంట వంట కోసం కష్టపడితే సరిపోతుంది. వారి ఫీజులకు పుస్తకాలకు డబ్బులు సంపాదిస్తే చాలు!" సువర్ణ ధీమాగా చెప్పింది.

ఆమె చాకచక్యం, మాటతీరు, జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడ్డ నిలకడతనం, నిజాయితీ ప్రసాద్‌కు ఎంతో నచ్చింది.

సువర్ణ పేచి చేసిన ట్యూబుని టైరులో ఎక్కించి గాలి పెట్టింది. తర్వాత జాకీ తీసుకుని లారీకి అమర్చింది. పని కుర్రవాడి సాయంతో బోల్టులను బిగించింది.

"చదువుకున్నాను. చదువుకి తగిన ఉద్యోగం కోసం వెతుక్కుంటూ ఎంతో సమయాన్ని వృధా చేశాను. స్వంత వ్యాపారం చేద్దామని నాన్న శతపోరు పెడుతున్నా వినలేదు. నిజంగా నిన్ను నీ కృషిని చూస్తుంటే నాకు సిగ్గు వేస్తోంది. " ప్రసాద్ నెమ్మది, నెమ్మదిగా చెప్పాడు.

ప్రసాద్ మాటలు సువర్ణను కూడా కదిలించాయి.

"కష్టపడితే ఫలితం ఉంటుంది. ఎవరైనా ఏ పని అయినా చేయగలరు. అయితే ధృఢ విశ్వాసం, సంకల్పం ఉండాలి. ఎప్పుడో వస్తుందో రాదో తెలియని ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ సమయాన్ని వృధా చేయడం కంటే మీ నాన్నగారు చెప్పిన పని చేయండి." అంది సువర్ణ.

పెద్దక్కలా ఆమె సలహా ప్రసాద్‌ని కదిలించింది.

ఇంతలో భోజనాలు చేసి లారీ సిబ్బంది వచ్చి సువర్ణకు డబ్బులిచ్చి లారీ ఎక్కారు. ప్రసాద్ ఆమె వద్ద వీడ్కోలు తీసుకుని లారీ ఎక్కాడు. లారీ ముందుకు కదిలింది.

ప్రసాద్‌లో ఆలోచనల పరంపర. సువర్ణ జీవితం ఆదర్శంగా స్వయం ఉపాధికి ఎందుకు ప్రయత్నించకూడదు? చదువేలేని స్త్రీ సాధించిన విజయం తనకెందుకు సాధ్యం కాదు? మనసులో అభిప్రాయం దృఢంగా గూడుకట్టుకుంటోంది.

తారు రోడ్డుపై లారీ మెత్తగా దూసుకు పోతోంది.



త్రినేత్రి

సులభ వాయిదాల్లో తీర్థయాత్రలు!

ఒసేవ్ ఇది విన్నావుటే... అనంటూ బామ్మ మా అమ్మకు వినబడేలా అరుచుకుంటూ బయటెక్కడినుంచో వస్తోంది.

ఆ వీధిలో ఎవరికన్నా ఏవన్నా అయిదేమోనని...

ఆవిడగారి బెస్ట్‌ఫ్రెండ్ అననూయమ్మామ్మగారి బీపీ ఎక్కువయ్యి జరగరానిదేవన్నా జరిగిందేమోనని...

ఆ వీధిలోని ప్రముఖులెవరైనా బకెట్ కిక్కింగేమోనని...

అది చెప్పడానికి వస్తోందేమో అని అనుకున్నాను. కానీ అదికాదులేండి.

ఇదుగో అమ్మాయీ... అనూరాధా.. అనంటూ అమ్మ పూర్తిపేరు పెట్టి, అమ్మాయీ అని దీర్ఘాలు సాగదీస్తూ అడుగుతోందంటే...

ఆ వీధిలోకి బామ్మకు ఇష్టమైన లేదా అవసరమైన వస్తువేదో అమ్మకానికొచ్చి ఉంటుంది...

అది కొను అంటానికొచ్చిందేమో అనుకున్నా...

అదీకాదులేండి...

అబ్బాయి ఎన్నింటికొస్తానని చెప్పాడమ్మాయీ...అనడుగుతోంది.

అంటే నాన్నతో ఏదో కొనిపించుకోడానికి టెండరు అమ్మద్వారా పెట్టబోతోందన్నమాట.

అమ్మ బామ్మోయ్...ఎంత తెలివి కలదానివో అనుకున్నాను.

బామ్మ అప్పుడప్పుడు "సీతమ్మకు చేపిస్తి...సింతాకూ పతకమూ...రామచంద్రా" అని భక్త రామదాసు కీర్తన పాడుతుంటే ఏంటో అనుకున్నా.

ఇంగ్లీషు మీడియంలో చదివేస్తే ఏదో ఊడిపడిపోద్దని, తెలుగు మీడియంలో చదివితే ఉన్నదేదో పోద్దని ఇంగ్లీషే కదా నేను చదివింది. అందుచేత నా బుర్రకి భక్తరామదాసు డైరెక్ట్‌గా రామచంద్రరవ్ గారినే అడక్కుండా...సీతమ్మకు అది చేయిస్తి, అది చేయిస్తి అనంటాడేవిటో అండర్‌స్టాండవ్వలేదు.

"నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి" అని శ్రీరామచంద్రుడు సీతమ్మచెంత మంచి క్లోజప్ స్మయిల్‌గా ఉన్నప్పుడు అడగమన్నట్లు అడగమంటాడేవిటో నా వయస్సుకి సినిమా పరిజ్ఞానం పుణ్యాన కొంచెం అర్థం కాకపోలేదనుకోండి. బట్...ఏవిటీయన అని ఓ డౌటు.

బామ్మే మా చిన్నప్పుడు చెప్పినట్లు గుర్తు. భక్తరామదాసు కీర్తనలు పాడుతూ...భద్రాది కబుర్లన్నీ చెప్పేది.

ఆ రూట్‌లో అమ్మను కాకాపట్టి...

అమ్మద్వారా తన పనేదో నాన్నతో చేయించుకోవాలని బామ్మ ఐడియా...

అమ్మ బామ్మో... హేట్సప్ టూ యూ...

ఇంతకీ విషయం ఏవిటంటే...

వాయిదా పద్ధతిలో యాత్రలకవకాశం ఇస్తున్నారనీ...నెలకింత చొప్పున వాయిదాల ప్రకారం కట్టేస్తే కొద్దినెలల తరువాత వాళ్ళు ఏదో యాత్రలకు తీసుకెళ్ళుతున్నారని బామ్మల మీటింగులో విన్నట్టుంది.

ఆ మీటింగ్‌లో ఎట్రాక్షన్ అయిన దాని ప్రకారం బామ్మ తను డైరెక్టుగా తన కొడుకుతో చెప్పకుండా...

రాందాస్ లెవల్లో అమ్మద్వారా నాన్నకు తన ఇండెంటు చేరవేయదలుచుకుందన్నమాట.



మైడియర్ బామ్మా... హేట్సప్ అందావంటే నా నెత్తిన టోపీ లేదుకదే...

అమ్మతో చెప్పాల్సిందంతా చెప్పి...నాన్నతో ఏమేమి ఎలా చెప్పి అడిగించాలో అన్నీ వివరంగా చెప్పింది.

అలా చెప్పేటప్పుడు అమ్మకు సాయంగా పోపుగింజల్లో నుసి ఏరేసి అమ్మ కచ్చితంగా తాలింపు వేసే టయానికి ప్రోగ్రామిక్‌గా వెల్లుల్లి, జీలకర్ర, మెంతులు, ఛాయపప్పు అందించింది కూడా.

హమ్మయ్య కోడలు పిల్లనొప్పిచ్చానని తనలో తాను స్థిమిత పడ్డాక...ఏం చేస్తున్నావే సుజి తల్లీ అంటూ నా దగ్గరకొచ్చింది బామ్మ.

అయిపోయ్నాన్రా నా డాడీయెూ అనుకుంటూ...ఏంటి బామ్మా సంగతన్నానా...

అంతే...

ఒక్కసారి పక్కింటి మామ్మగారింటికెళ్ళి ఇప్పుడే మా బామ్మకు చూపించిన అట్ట మడత... అదేలేండి బ్రోచర్ అని మా బామ్మకు తోచిన వర్ణన...ఇమ్మన్నాని తెచ్చిపెడుదూ అని గడ్డంపట్టుకు మరీ అడిగింది.

ఆ తరువాత దాన్ని చదివి తెలుగులో అర్థంచెప్పే పనికూడా ఆ పక్కనే ఉంటుందనికూడా ఊహించేశాను.

తీరా అడిగి ఆ అట్టమడత అలియాస్ బ్రోచర్ అడిగి తేబోయానా...ఆ తెచ్చే బ్రోచరెమ్మటే ఆ మామ్మగారు కూడా వాళ్ళ కోడలికి ఇప్పుడే వస్తానమ్మాయ్ అని కేకతో బై కొట్టి నా వెనుకే వచ్చేసింది.

అంటే మా బామ్మ నా మనవరాలితో చదివి చెప్పించుకుందాములే అని ముందే ప్రోగ్రామ్ సెట్‌చేసిందని అర్థంకాగానే మళ్ళా మా బామ్మకు హేట్స్‌ప్ చేద్దామనుకుంటే మా డాడయ్య ఒక్కటోపీ కూడా కొనిపెట్టలేదు మరి!

సరే...వ్వాట్ కెనయ్ డూ మరి...

మా బామ్మ, మా బామ్మ జిగిరీ దోస్త్ పక్కింటి మామ్మగార్ని కూచోబెట్టుకుని ఆ ట్రావెలింగ్ ఏజెన్సీ వాడి అందమైన బ్రోచర్ చదివి తెలుగులో వాళ్ళిద్దరికీ చెబుతున్నాను.

నెలకు 467 రూపాయలు ఇ ఎమ్ ఐ అనగా సరియగు నెలసరి వాయిదాల కింద కట్టుకుంటూ కట్టుకుంటూ పోతే ఓ మూడేళ్ళకు అయ్యే మొత్తంతో అందాల సింగపూర్ యాత్రకు టూరిజం ప్యాకేజీ అని చెప్పా.

అంటే సింగాయిపురంలో ఏమేమి గుళ్ళుంటాయో అని అడిగింది మా పక్కింటి మామ్మగారు.

వుండేది ఒక్కటో రెండో గుళ్ళున్నా...వాటిని చూడ్డానికెళ్ళిన ఊళ్ళో వింతలూ విడ్డూరాలు అన్నీఇన్నీ కాదు అక్కయ్యా అని మా బామ్మ అనడం వింటే మా బామ్మ సింగపూర్ ట్రిప్‌పై ఎన్ని ఆశలు పెంచుకుందో కదా అనుకున్నాను.

మన దేశంలో మూలవిరాట్టుగా వెంకటేశ్వర స్వామి దేవుడుగా ఉన్నా దాన్ని బిర్లా టెంపులన్నట్లు, సంఘీ టెంపులన్నట్లు అక్కడా మోడరన్ దాతల గుళ్ళుగా ఉండిఉంటాయని మా బామ్మకు ఎలా చెప్పాలో...?!

గుళ్ళూగోపురాల మాటెలా ఉన్నా సింగపూర్ టూర్ ప్యాకేజీ వల్ల ఎవరెవరికెంత లాభమో ఈ పెద్దతరాలకు ఎలా చెప్పాలో...?!

పైగా ఈ టూర్ ప్యాకేజింగ్ కి బ్యాంక్ రుణం కూడా కలదని అంటున్నాడంటే నాన్న జీతానికి ఈ లోన్ కట్టింగ్ అదనం అవుతుందనీ బామ్మకు అర్థమయ్యేదెలాగో?!

రెండుమూడు రోజులకు వాయిదా పద్ధతిలోనే మా బామ్మకు సింగపూర్ టూర్ ఇన్ ఇన్‌స్టాల్‌మెంట్ గురించి అర్థమయ్యింది కానీ...

అది కాదే సుజాతా...ఆ పెట్టేదేదో మన తిరుపతి యాత్రకో...అన్నవరం సత్యనారాయణ తీర్థానికో...షిర్డీ సాయి మందిరానికో ఇలా వాయిదాల తీర్థయాత్రల చీటీపాట పెడితే బాగుండేది అనంటుంటే...

హా రామచంద్రా...ఏమి మీ గాడ్‌ల లీల...మీ వద్దకు వచ్చే భక్తులకిచ్చే వరమిలా ఇన్‌స్టాల్‌మెంట్స్‌మీదేనా...

...అని అనుకున్నాను.

వాట్ కెనయ్ డూ చెప్పండి!!!

అభివృద్ధంటే అప్పులు జేసుడేనా...?!

డా॥ కాలువమల్లయ్య

ఆ ఊర్ల సుధాకరు మస్తు యాక్టరన్నట్టు. ఇస్కూలు రోజులు కాన్నుంచి ఆనికా పేరుంది. చాలా డ్రామాలల్ల ఏశాలు కట్టిండు. మస్తు డైలాగులు జెప్తడు. యాక్టింగ్‌తో పాటు మిమిక్రీ కూడా బాగ జేస్తడని అందరూ అతగాన్ని ఊరు రచ్చబండ దగ్గర రాంగానే ఆన్ని, వీన్ని అనుకరించి ముచ్చట్లు చెప్పమని అనవట్టింద్రు. రాజమల్లన్న రచ్చబండకు ఆ చివర్న కూసున్నడు. తనను చూస్తే షర్మయితాడని చూసీచూడనట్లే కూసున్నడు.

అందరడింగింద్రు గదాని అధికారం నుంచెల్లి... పతిపక్షంల ఉన్న గా తెలుగుదేశపు నాయకున్ని అనుకరిస్తూ మిమిక్రీ మొదలెట్టిండు సుధాకర్.

"....మేం వచ్చినప్పటికెల్లి దేశం కొంచెమభివృద్ధి చెందిననుకుంటంద్రా... మన రాష్ట్రం గురించయితే చెప్పనే వశం గాదు. ఎంతెంత ముందుకు పోతున్నదనుకుంటున్నరు...? పైకిపోతంది... ముందుకు పోతంది... సైన్సుల సాంకేతిక రంగంల, కంప్యూటర్లల్ల, ఐటిల మనం జోరుదారుగ ముందున్నం. మన రాష్ట్రాన్ని అక్షరక్రమంలనే కాదు అన్ని రంగాలల్ల ముందుండెటట్టు కోశిశ్ జేశినం. ఊరూరా కంప్యూటర్లు పెట్టి పరిపాలనజేత్తె ఎంత సౌలత్‌గఉంటదను కున్నరు...? ఏ సంగతి కాదన్నన్నా ఒక్క మీటొత్తుతె ఐపోతది.. ముత్తెమంత సేపట్లనే అన్ని సంగతులు మనకు తెల్సిపోతయి. నక్సలైట్ల నేరేసుటానికి జెబర్దస్తీగా ఏర్పాట్లు చేసినం. మేం మస్తుమందికి నౌకర్లిస్తున్నం. నక్సలైట్లనెదుర్కోనన్నంటె పోలీసులు మస్తుమందుండాలెగద... ఇంక పల్లెటూల్లపొంటి ఉన్న బడులల్ల సదుజెప్పన్నంటె సార్లు కావాలె గద...! అన్ని బందాయె దాకనయితె ఒక్కలిద్దరన్న సార్లుండాలె గద... గందుకే యాడాదిక్కొన్ని సారు నౌకర్లితున్నం...

వేం మస్తు అభివృద్ధి జేత్తాంటె రొండు రూపాయలకు కిల బియ్యమో, రైతుకు వట్టిగ కరెంటో ఇయ్యమంటేమన్నట్టు...? మేం రాష్ట్రాన్ని హైటెక్కు దిక్కు ముందుకు గుంజుక పోవుడు ప్రజల కోసమే కద...! మేమచ్చినంక పట్నంల రోడ్లేపిత్తిమి... రోడ్లమీద ఫ్లైఓవర్లు గడ్తిమి. హైటెక్కు సిటీ కడ్తిమి. ఇన్ని జేత్తాంటె అప్పులు గమ్మంటె కావా? అభివృద్ధిని సూడాలెకాని ధరలు పెంచుతంద్రని, కరెంటుబిల్లును జూత్తె షాకత్తందని, నీల్లుగూడ కొనుక్కుంటున్నమని, నౌకర్లు తీసెత్తురని, పోరగాండ్లకు వెయ్యిలకొద్ది పీసులెట్ల కట్టుడని ఒర్లుతరెందుకు...? రాజకీయం సేత్తరెందుకు...? గిదంత ప్రతిపక్షాలోల్ల కుట్రే. అభివృద్ధన్నంక ధరలు పెరుగయా... అని మనవి జేసుకుంటున్నా...

అప్పులు అప్పులని మొత్తుకుంట రెందుకు... అప్పులు జెయ్యకుంటె అభివృద్ధిట్లయితది... గీ తీరు అప్పులయితె ఎట్ల తీర్చుడంటేమన్నట్టు...? అరే మనం పంటల్లు పండించాలె... గవ్వి విదేశీయుల పంటలతోని పోటీపడాలె మన వస్తువులు విదేశాలకు ఎగుమతి చెయ్యవచ్చెటట్టుండాలె. ఇదువరుకటి లెక్కనే పాత పంటలే పండిత్తమంటె గాల్లెట్ల తింటరు. నాణ్యంగుండాలె. మన పోరగాండ్ల రాష్ట్రమిడిసి, దేశమిడిసి పోతె గదేమన్న తప్పా... కోట్లల్ల విదేశీమారక ద్రవ్యం సంపాయించుకత్తరు గద...! మనోల్లు దేశ మిట్సు పెట్టుడెందుకంటేమన్నట్టు... వాళ్ళతీరుగ నాణ్యమైన పంటలు పండించాలె. నాణ్యమైన వస్తువులు తయారుజెయ్యాలె. లేకుంటె గుండుసూది, సన్నబియ్యం, కోడిమాంసం కాన్నుంచి అన్నీ అక్కన్నుంచే తెప్పిత్తం. కార్పొరేట్ ఎవుసాయం జేసి మస్తు పండి య్యాలెనని నేను జెప్పుతాంటె అడ్డదిడ్డం ప్రశ్నలేత్తరేంది...? గక్కడి తీరుగ సబ్సిడీలు ఇయ్యమంటే మన్నట్టు... సబ్సిడీలపై అభివృద్దెట్ల యితది...? ఏమంటంద్రు... పొగాకు రైతులు, మిర్చి రైతులు, పత్తిరైతులు, చేపలరైతులు, చేనేత కార్మికు లందరు ఆత్మ హత్యలు చేసు కుంటున్నరా. గిదంత వట్టిదే... ప్రతిపక్ష పోల్ల కుట్ర... మేం రాష్ట్రాన్ని ఎంతో ముందుకు ముందుకు పైపైకి తీసుకపోతాంటె వాళ్ళోర్తలేరు. అన్ని అభాండాలేత్తున్నరు... సరె... ఆత్మహత్యలు చేసుకున్నరను కుందాం. అభివృద్ధన్నప్పుడు గాయంత ఆత్మహత్యలు చేసుకోరా...? చేసుకుంటేం దట. గాల్లకు ఎక్స్‌గ్రేషియా నో గదేదో ఐతే అభివృద్ధెట్ల యితది... అప్పులిచ్చె తెల్లసార్లా కుంటరా. ప్రపంచ బేంకోల్లూ కుంటరా... మేమయితె మస్తభివృద్ధి జేస్తున్నం అని మనవి జేసుకుంటన్నా".

గా చివరి డైలాగులకు రాజమల్లన్న గూడ నవ్వాపు కోలేక గట్టిగా నవ్వబట్టిండు.

"అబ్బ...! ఓడిపోయిన తెలుగుదేశపు పెద్దసారు చెప్పినయన్ని మస్తు యాదికుంచుకున్నవు గద. గదంతా కతోలె జెప్పితివి.." అన్నడు లచ్చిరాజం సుధాకర్ మిమిక్రీని మెచ్చుకుంటూ.

"తొమ్మిదేండ్లవట్టి రోజు వినుడేనాయె. టీవీలల్ల సూసుడాయె. పొద్దుగాల్లేత్తెన గయినె మొకం కనవడె. పేపరు తిరగెత్తెనే గయినె మాటలు సదువన్నాయో... ఇగ గాయింత యాదికుండయా..." అన్నాడు సుధాకర్ తన మిమిక్రీ ఆపి...

"ఏండ్లతరబడి గిట్ల సెప్పుతనే ఉన్నడు ఆ పెద్దసారు. అభివృద్ధి అభివృద్ధన్నడు బోర్ల వడ్డడు. ఓ దిక్కు ఆకలి చావులుంటె ఇంకోదిక్కు నీటి బొట్టుకోసం గింజుక సత్తాంటె గయినేమో అభివృద్ధనె... రాజమల్లన్నా...! నాకు తెలియకడుగత. అభివృద్ధంటేందే...?" అన్నడు సుధాకరు.

"అవునే... అభివృద్ధంటె ఈ తీరుగ అప్పుల్జేసుడేన? దుమ్ము దుమ్ము అప్పుల్జేసి అభివృద్ధనె గయినె... మరి గీ అప్పులన్నిట్ల దీరాలె...? గీదేందో గందురగోళంగుంది. ఇంతకు అభివృద్ధంటేందే రాజమల్లన్న...?" అన్నడు వెంకటేశం.

"అయ్యో...! గీంత తెలువదా తమ్మి...! అభివృద్ధంటె అడుక్కుతినుడు. ప్రపంచబ్యాంకు ముందు తలవంచుడు. గక్కడడుక్కొని, అభివృద్ధని గిక్కడ ఓట్లడుక్కోని మల్ల గెలుత్తననుకున్నాట్ట... కాని ప్రజలకు అభివృద్ధి బండారమేందో అరుతమయింది." అన్నడు రాజమల్లు.

"ఏదన్నయితె మీది మోటర్ల నుంచి చూసిపెయిరి. ప్రజలకు కడుపు నింపే పనులయితె ఒక్కటి సెయ్యకపోయిరి. గందుకే జాడలేకుంట ఓడిపోయిరి. గని మరి గీ గెల్సి గద్దెనెక్కిన సార్లనే అభివృద్ధేంటే...? మరి గీనె గూడ అప్పులకు పోవట్టె... వాళ్ళందిట్టి గీ రెడ్డిసారుగూడ అప్పులు జేసుడేందే...?"

"సరిగ్గ జెప్పినవ్‌రా ఈరమల్లు... గయినె అడుక్కునుడే అభివృద్ధంటే, గీనె నీటిపారుదల ప్రాజెక్టులు ఆర్‌పార్‌గ గట్టుడే అభివృద్ధంటున్నడు. ఇవి అవసరమేననుకో... ప్రజలకుపయోగపడేవే అనుకో. అయితె గిసోంటియన్నీ కావన్నంటె ఏదో మేరకు అప్పులు దప్పవు. కాని గా అప్పులు మోతాదు లుండాలె... ఎడాపెడా అప్పుల్జేత్తె అటెనుక తీర్చుడు కష్టంగద...! పోయిన సారయితె వాళ్ళు ఏది జెప్పుతె అది జేత్తనని అప్పుల్దెచ్చిండు... ఒక్క పైస గూడ సామాన్య జనాలకు ఉపయోగపడేది చెయ్యలేదు. గీ సారు గట్ల కండీషన్ల కేమొప్పుకుంటలేడుగని ఏగిర్త పడ్తండు... ఉన్నదాంట్ల సదురుమందామనుకుంటె మంచిగుండు... కాని అన్ని ఒక్కోసారే చేసి పేరు కొట్టెయ్యన్నని సూత్తండు.. సరే..నలుగురికుపయోగపడే పనయితె అప్పుజేసినా మంచిదేకని మోతాదు మించుతె కష్టమైతది... కొంచెం వెనుకాముందు ఆలోసించి సేత్తె మంచిది..." అన్నడు రాజమల్లు. "మరి గీ సారు లెక్కల అభివృద్ధంటేందే...! అప్పుజేసి పప్పు కూడు తినుడంటవా..."

"అప్పుజేసి పప్పుకూడా తిన్నదానికంటె పచ్చిపులుసు మెతుకులు తిని ఉంటామన్నా మంచిదే కాని కొన్నిటికి అప్పులు తప్పవు. గా పైసలు ప్రజల బాగోగుల కోసం వాడితె మంచిది. ఎంతయినా ప్రజలమీద భారం పడకుంటగ జేయాలె..." అన్నడు రాజమల్లు.

ఇంకా కనుమరుగవ్వని కుష్ఠు

డా॥ నాగినేని భాస్కరరావు

నేటి సామాజిక ఆరోగ్య సమస్య

అశ్రద్ధ, అలసత్వం, అజ్ఞానం కలగలిసి, తెలిస్తే కుటుంబం నుండి, సమాజం నుండి వెలివేస్తారేమోనన్న భయంతో ఒంటిమీద మచ్చ కనబడగానే దాన్ని దాచుకుంటూ చివరకు వ్రేళ్లు తినేసిన చేతులు, దూలం పోయిన ముక్కు, గ్రుడ్డిదైన కన్ను - అలా అంగవైకల్యాన్ని కల్గించే జబ్బు కుష్ఠు.

నిజానికి మచ్చ లేక మచ్చలు కనబడగానే యం.డి.టి చికిత్స తీసుకుంటే రోగం పూర్తిగా నయమవ్వటటేగాక ఇతరులకు వ్యాధి సంక్రమించదు, అంగవైకల్యం కూడా రాదు. క్రీస్తుపూర్వం 600 సం॥లోనే ఆయుర్వేధ గ్రంథంలో కుష్ఠు వ్యాధి గురించి వర్ణించటం





జరిగింది. కీ.శ. 4వ శతాబ్దంలోనే రోమ్‌లో క్రైస్తవులు కుష్ఠు రోగులకు ఆస్పత్రులు నడిపారు. కుష్ఠు ఏ పాప ఫలితంగానో లేక వంశపారంపర్యంగానో వచ్చే జబ్బుకాదు.

1873లో నార్వేలో డా॥ ఆర్మర్ హన్‌సన్ కుష్ఠు వ్యాధికి కారకమైన మైక్రో బ్యాక్టీరియమ్ లెప్రసీని కనుగొన్నాడు. అందువల్లనే కుష్ఠువ్యాధికి 'హన్‌సన్స్ వ్యాధి' అని కూడా పేరు. 1941లో చికిత్సకు సల్ఫోన్స్-డి.డి.ఎస్ లేక డాప్సోనును కనుగొన్నారు. 1980లో ఎం.డి.టి - బహుళ మందుల సమ్మేళనాన్ని చికిత్సలో ప్రవేశపెట్టారు.

వ్యాధితీవ్రత: ప్రపంచం మొత్తం కుష్ఠువ్యాధి కేసుల్లో 75శాతం భారతదేశంలోనే వున్నాయి. భారతదేశ జనాభాలో ప్రతి 10,000 మందిలో దాదాపు ఐదుగురికి కుష్ఠు వ్యాధి వుంది. అయితే సమాజం నుండి కుష్ఠు వ్యాధిని ఎలిమినేట్ అనగా తొలగించడం జరగాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం "10,000 జనాభాలో కుష్ఠురోగుల సంఖ్య ఒకటి కంటే తక్కువగా నమోదుకావటం" దీన్ని 2007 లోగా సాధించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిర్వచనం: మైక్రోబాక్టీరియం లెప్రె అను క్రిముల వల్ల కలిగే దీర్ఘకాలిక అంటువ్యాధి కుష్ఠు వ్యాధి. కుష్ఠువ్యాధి ముఖ్యంగా నరాలకు సోకేజబ్బు. అయినా చర్మానికి, కంటికి, పై శ్వాసకోశ మార్గ మ్యూకస్ పొరలకు, కండరాలకు, ఎముకలకు వృషణాలకు సోకుతుంది. ఏ వ్యక్తికైతే శరీరంపై పూర్తిగా స్పర్శలేని మచ్చ లేక మచ్చలు ఉన్నాయో యం.డి.టి పూర్తి నియమిత చికిత్సను పూర్తిగా వాడలేదో ఆ వ్యక్తిని కుష్ఠు రోగి అంటారు.

మైక్రో బాక్టీరియం లెప్రె క్రిమి నిటారైన కర్ర ఆకారంకల్గి వుండి 8 మైక్రోమీటర్ల పొడవు, 0.3 మైక్రోమీటర్ల వ్యాసం కల్గి వుంటుంది. వ్యాధి సోకిన ధాతువుల్లో ఈ బాక్టీరియా గుంపులు గుంపులుగా కలిసి గోళాకారంలో కలిసి వుంటాయి. ఇది పెరగడానికి సరైన ఉష్ణోగ్రత 30-33 డిగ్రీలసెంటీగ్రేడ్. 12-13 రోజులకొకసారి విభజన జరుపుకుంటుంది.

ఇంక్యుబేషన్ కాలం: శరీరంలోకి ప్రవేశించాక ఇది చాలా నెమ్మది నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావటానికి (ఇంక్యుబేషన్ కాలం) సగటున 3-4 సంవత్సరాలు పడుతుంది. దీనికి వయస్సు, లింగ భేదం లేదు. దాదాపు మనిషి ఒక్కడే ఈ వ్యాధికి రిజర్వాయరు. మనిషిలోనూ, ఇతర క్షీరద అతిథుల్లోనూ మై. లెప్రె క్రిమి జీవకణాల్లో వుండే ఒక పరాన్నజీవి. ఇది చర్మంలో వుండే హిస్టియోసైటు కణాల్లో, నరాల స్కావన్ జీవకణాల్లోనూ ముఖ్యంగా గుణితమౌతుంది.

వ్యాప్తిచెందు విధానం: 1. చికిత్స తీసుకొనని మల్టీబాసిలరీ రోగి నుంచి శ్వాసకోశ మార్గం నుండి లేదా చర్మం ద్వారాగాని యితరులకు సోకుతుంది. రోగి శరీరం నుండి ఈ బాక్టీరియా ముక్కు నుండి నోటి నుండి తప్పించుకుని బయటకు వస్తాయి. 2. మై. లెప్రె క్రిములు శరీరంలోనికి ప్రవేశించటానికి ముక్కు ప్రధాన ద్వారం.



కుష్టు వ్యాధికి గురయ్యే నాడీమండల వ్యవస్థ

కుష్ఠు వ్యాధి మచ్చలు: చర్మపు రంగు సహజ రంగుకంటే తక్కువరంగు లేదా ఎర్రని లేదా రాగివర్ణం కలిగివుండవచ్చును. 2. చర్మపు ఉపరితలంతో సరిగా లేదా ఉబ్బెత్తుగా వుండవచ్చును. 3. దురద పెట్టవు. 4. సాధారణంగా ఎలాంటి ఇబ్బందులు కల్గించవు. 5. వేడి, తాకిడి లేదా నొప్పి, స్పర్శలు వుండవు. 6. దేహంపై ఏ ప్రదేశంలోనైనా రావచ్చును. ఇంకా కుష్టువ్యాధిలో ఎరుపు లేక చర్మపు రంగు గల కణుతులు లేదా స్పర్శవున్న (స్పర్శ పోగొట్టుకోని) మెరుపు (నిగనిగ) లాంటి వాచిన చర్మం.

వ్యాధి నిర్ధారణ: రోగి నుండి పూర్తి సమాచారం సేకరించుట చర్మనిర్మాణ, నరాలను పరీక్షించుట మరియు బాక్టీరియా కొరకు (సూక్ష్మదర్శినితో) పరీక్షచేయుట మొదలగు వాటివల్ల వ్యాధిని నిర్ధారణచేయవచ్చును.

అనుమానం వున్నపుడు వెంటనే ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తగు పరీక్షలు చేయించుకోవాలి. క్రింద యిచ్చినవి కుష్ఠు వ్యాధిని నిర్ధారించుటకు రోగిని పరీక్ష చేయు విధానం. 1. చర్మంపై మచ్చలకు పరీక్ష, 2. నరముల పరీక్ష 3. స్పర్శలేమిని పరీక్షించుట నొప్పి కోల్పోవటాన్ని పరీక్షించుట. 4. ఉష్ణోగ్రత, చల్లదనాలు తెలుసుకునే స్థితిని కోల్పోవటాన్ని పరీక్షించుట మొదలుగునవి.

ఇతర విషమ పరిస్థితులు: మై.లెప్రె క్రిములు ఎక్కువగావుండే లెప్రోమాటస్ కుష్ఠువ్యాధిలో దాదాపు అన్ని అవయవాలు కండ్లు, ముక్కు, గొంతు వృషణాలు మొదలగునవి విషమ పరిస్థితుల్లో వెళ్ళాయో లేదో పరీక్ష చేయాలి.

రియాక్షన్లు: కుష్ఠు రోగిలో యం.డి.టి చికిత్స తీసుకున్నా/తీసుకోకపోయినా అతని శరీరంలో కలిగే రియాక్షన్లు వున్నయో లేదో చూడాలి. జ్వరం, నరాలనొప్పి, E.N.L రియాక్షను, కన్నుఎర్రబడి వాయటం, వృషణాలవాపు, కీళ్ల వాపు, నొప్పులు మొదలుగునవి.

Sensory Nerve damage: స్పర్శలేమివల్ల చేతుల్లో, కాళ్లలో పుండ్లుపడటం, గాయాలు కావటం, పుండ్లుపడటం, చేతివ్రేళ్లు, కాలివ్రేళ్లు తినేసి ఉండటం మొదలుగునవి.

Motor nerve damage: నరాల బలహీనత, కండరాలు కృశించిపోవటం, వాటిల్లో బలం తగ్గటం, పక్షవాతం రావటం, కాంట్రాక్చర్ రావటం.

Autonomic Nerve damage: కుష్ఠు వ్యాధి మచ్చలవద్ద వెంట్రుకలు ఊడిపోవటం, కనుబొమ్మల వెంట్రుకలు ఊడిపోవటం, చెమట పోయకపోవటం, చర్మం చిట్లిపోవటం, పగుళ్లు రావటం, పుండ్లు పడటం మొ॥ పూర్తిగా యితర అవయవాల శాఖల పరీక్ష చేయుట.

చర్మపరీక్ష: స్లిట్ స్కిన్ స్మీర్‌టెస్ట్ ఫర్ ఎఎఫ్ బి ఈ పరీక్షలో మైకోబాక్టీరియా లెప్రె

క్రిములున్నాయో లేదోనని పరీక్ష జరుగును. 2. యింకా నిర్ధారణకాకపోతే జుఓజు కోసం చర్మం (మచ్చ వద్ద లేక నరం (బయాప్సీ) పరీక్ష చేయాలి.

వ్యాధి ముఖ్య లక్షణాలు: మూడు.

1. తప్పనిసరిగా స్పర్శ లేకుండా ఎరుపు లేక శరీర సహజరంగుకన్నా తక్కువ రంగుకల మచ్చలుండటం.

2. నరములవాపు ముఖ్యంగా ఆ నరములవల్ల పనిచేసే అవయవాల కండరములలో బలహీనత, చర్మంపై స్పర్శలేమి. ముఖ్యంగా చేతులు, పాదములు, ముఖము మరియు కండ్ల యొక్క కండరములు ప్రభావితమవుట. 3. చర్మ పరీక్షలో మైకోబాక్టీరియంలెప్రె క్రిములు ఉండటంపైన చెప్పబడిన మొదటి రెండు లక్షణాలను వైద్య పరీక్షల ద్వారా తెలుసుకొనవచ్చును. 3వ లక్షణమును మైక్రోస్కోపు పరీక్షద్వారా తెలుసుకోవాలి. పై మూడు లక్షణాలలో కనీసం రెండు లక్షణాలున్నా ఆ వ్యక్తిని కుష్ఠు రోగిగా నిర్ధారణ చేయవచ్చును. పైన చెప్పబడిన లక్షణములు లేనిచో ఆ వ్యక్తిని మరికొంతకాలం (6నెలలు లేక ఎక్కువకాలం) తరువాత పరీక్ష చేయాలి.

అనుమానం వుంటే కుష్ఠు వున్నట్లుగా నిర్ధారణ చేయరాదు.

వర్గీకరణ: చికిత్సకు మరియు తేలికపద్ధతి గానూ శరీరంపై వున్న మచ్చలను బట్టి కుష్ఠువ్యాధిని ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును.

కుష్టు రోగం నిర్ధారణ అయ్యాక వర్గీకరణను బట్టి ఎం.డి.టి మందుల సమ్మేళనంతో వెంటనే చికిత్సను ప్రారంభించాలి. ఒక్క మోతాదు తీసుకున్న శరీరంలో క్రిములు చనిపోతాయి. వివరాలు దిగువనీయబడ్డాయి.

గమనిక: 10 సంవత్సరములలోపు పిల్లలకు వారి బరువును 3/4 బట్టి మోతాదును నిర్ణయించాలి.

6నెలల పి.బి. చికిత్సను 9 నెలల్లో పూర్తి చేయాలి.

12నెలల యం.బి. చికిత్సను 18 మాసాల్లో పూర్తి చేయాలి.

ఆరోగ్యకార్యకర్త/గ్రామీణ ఆరోగ్యమార్గదర్శి పర్యవేక్షణలో రోగికి మొదటి రోజు నెలకొకసారి ఇచ్చేమందులను వాడాలి. పైన చెప్పబడిన రెజిమెన్స్ అన్నీ 28 రోజుల కోర్సుగా బ్లిస్టరు ప్యాకింగ్స్‌లో ఒక మచ్చ వుండి ఒకడోసు Rom వాడిన రోగిని 6నెలలపాటు, పి.బి. చికిత్స పొందినరోగిని కనీసం సంవత్సరానికొకసారి చొప్పున రెండు సంవత్సరాలు, అదే విధంగా యం.బి.చికిత్సను పొందిన రోగిని

ఎం.బి.కుష్ఠు	రిఫాంపిసిన్	600మి.గ్రా.	నెలకొకసారి	-	300మి.గ్రా. 12నెలలు
	క్లోఫాజిమిన్	300మి.గ్రా.	- మొదటిరోజు 2వరోజు నుండి 28వరోజువరకు		150మి.గ్రా మొదటిరోజు ఆతర్వాత రోజువిడిచి రోజు50 మి.గ్రా
డాప్సోను	100మి.గ్రా.	రోజూ			50మి.గ్రా. రోజు

సం॥నకొకసారి చొప్పున ఐదు సంవత్సరాలు. ఏమైనా కాంప్లికేషన్లు వున్నాయా? రోగం తిరుగబెట్టిందా? అని చర్మపు పరీక్షలు జరిపి పరిశీలనలో వుంచాలి. ఆయా కాలాలు పూర్తయ్యాక వారిని RFC Released from the control అనగా పరిశీలన నుండి విడుదల (అయారన్నమాట) చేయబడ్డారన్నమాట.

న్యూరైటిస్ మరియు అంగవైకల్యం, నివారణ: కుష్టు వ్యాధిలో నరములకు క్రిములు సోకుట



వలన చికిత్స తీసుకోకపోతే అంగవైకల్యాలు వస్తాయి. అయితే వీటిని నివారించవచ్చును. అయితే వైకల్యాలు ఏర్పడకుండా నివారణే ముఖ్య విషయం. శరీరంలోని వివిధ నరాలు వ్యాధిగ్రస్తమైనపుడు వైకల్యాలు ఎలా వుంటాయో చూడండి. clear 4 median nerves paralysis clave hand, paralysis of Radialn wrist drop posterior Tibial nerve paralysis clautoes, comon peronealnerve paralysis drop foot Facial nerve paralysis Lagophthalmos (కండ్లు మూయలేకపోవటం) మొదలైనవి సంభవిస్తాయి. స్పర్శలేమి ఉంటుంది. అలాగే కార్నియాకు స్పర్శలేమి కల్గుతుంది. పై

	ఒకే మచ్చవున్న పి.బి	పి.బి.	యం.బి
1. చర్మపుమచ్చలు:	ఒకే చర్మపు మచ్చ	2-5 మచ్చలు	5 కంటే ఎక్కువ మచ్చలు
2. నరాల ప్రమేయం	నరాల ప్రమేయంవుండదు	నరాల ప్రమేయంలేదు లేక ఒకే ఒక నర్వ్‌టంక్ ప్రమేయం.	ఒకటికంటే ఎక్కువ నర్వ్‌టంక్‌లు ప్రమేయం

ఉచితంగా అన్ని ఆరోగ్య కేంద్రములలో /కుష్టు వైద్య కేంద్రములలో లభిస్తాయి. పూర్తిగా కోర్సు మందులను వాడిన రోగులను రోగం నయమైనట్లుగా పరిగణించి చికిత్స నుండి విడుదలైనట్లుగా పరిగణిస్తారు.

చికిత్స పూర్తి చేసిన రోగి పున:పరిశీలన:

రెజిమెన్	వాడే మందుల	పెద్దలకు	పిల్లలకు	కాలం
1. ఒకే మచ్చవున్న కుష్టు	రిఫాంపిసిన్	600మి.గ్రా	300మి.గ్రా	ఒకేడోసు
	ఓఫ్లాక్సీసిన్	400మి.గ్రా	200 మి.గ్రా	
	మనోసైక్లిన్	100మి.గ్రా.	50మి.గ్రా.	
2. పి.బి.కుష్ఠు Pancibacillary Leprosy	రిఫాంపిసిన్	600మి.గ్రా. నెలకుఒకసారి	300 మి.గ్రా.	
	డాప్సోన్	100మి.గ్రా. రోజు	50 మి.గ్రా.	6నెలలు

వైకల్యాలను అనగా నేరుగా మై.లెప్రె క్రిములు ధాతువులపై చూపించే ప్రభావంవల్ల కల్గుతాయి. నీటిని "ప్రాథమిక వైకల్యాలు" అంటారు.

సెకండరీ వైకల్యాలు: ప్రాథమిక వైకల్యాలను అశ్రద్ధ చేస్తే సెకండరీ వైకల్యాలుకు దారితీస్తాయి. కాళ్లు, చేతులు కాలుట, వాటి పై పుండ్లు పడుట, చేతివ్రేళ్లు, కీళ్లు (వంకరైనవి) గట్టిగా మారుట మరియు కాలివేళ్ల కీళ్లు బొటనవేలికీళ్లు గట్టిగా అగుట, కాళ్లు, చేతుల చర్మం చిట్లిపోయి చివరకు వాటి వ్రేళ్లు తినివేయుట జరుగుతుంది. కనుక చేయి లేక కాలిలో నరాలనొప్పి, స్పర్శలోపించటం, బలహీనత, తిమ్మిరి మొదలైనవి కలిగినపుడు వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డాక్టరుకు రిపోర్టు చేసి తగు చికిత్సపొంది అంగవైకల్యాలను అరికట్టాలి. పూర్తిస్థాయి యం.బి. చికిత్సను కూడా పొందాలి. రోజూ ముఖాన్ని చేతుల్ని కాళ్లను స్వయంపరీక్ష చేసుకోవాలి.

పాదరక్షలు: కుష్టు రోగులు MCR మైక్రోసెల్యులార్ రబ్బరు కల్గిన పాదరక్షలు మాత్రమే ధరించాలి. ఇవి కుష్టు ఆరోగ్యకేంద్రాల్లో ఉదా॥ శివానంద రీహాబిలిటేషన్ హోం, కూకట్‌పల్లి, హైదరాబాదు-500 072 వద్ద లభిస్తాయి. వీటి వాడుక వలన పుండ్లను నివారించుటకు, పుండ్లు వుంటే త్వరగా మానుటకు ఉపయోగపడతాయి.

పునర్‌నిర్మాణ శస్త్రచికిత్స: కుష్టు రోగులకు వచ్చిన అంగవైకల్యాలను పునర్‌నిర్మాణం శస్త్రచికిత్స ద్వారా సరిచేసి ఆ రోగులు తిరిగి తమ పూర్వ జీవితాన్ని ప్రారంభించేట్లు చేయవచ్చును.

రియాక్షన్లు: కుష్టురోగుల్లో చికిత్స తీసుకున్నా తీసుకోకపోయినా రియాక్షన్లు వస్తాయి. ఈ రోగుల్ని కుష్టు వైద్య కేంద్రములకు పంపి వారికి చికిత్స చేయాలి.

పునరావాసం: కుటుంబం నుండి, సమాజం నుండి తిరిగి గౌరవాన్ని, జీవనభృతిని పొందటానికి కుష్టు రోగులకు చికిత్స తీసుకున్నాక పునరావాసం కల్పించాలి. వారికి తగ్గ వృత్తిని చేపట్టుటకు ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థలు కృషిచేయాలి. దిక్కులేని వారికి పూర్తిగా పునరావాసం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. శివానంద రీహాబిలిటేషన్‌హోం, 1958 సంవత్సరంలో సంఘసేవా పరాయణురాలు, మాజీ ఎం.ఎల్.సి. మాజీ ప్రథమ మహిళామేయరు శ్రీమతి జె.కుముదినీదేవి స్థాపించిన ఈ హోంలో దాదాపు 550 మంది కుష్టు రోగులకు అన్ని రకాల ఉచిత సేవలు అందుతున్నాయి. ప్రొఫెసర్ పి. హృషికేశ్ గారి ఆధ్వర్యంలో డా॥ ఎ.ఒ.బెయినీ నేతృత్వంలో పునర్‌నిర్మాణ శస్త్రచికిత్సలు ఉచితంగా జరుగుతున్నాయి. కుష్టు వ్యాధికి సంబంధించి ఇది ఒక Referral Hospital.

సమాజం నుండి కుష్టు వ్యాధిని తొలగించుట: ఇది అందరిబాధ్యత. ఎవరైనా సరే శరీరంపై కుష్టువ్యాధి మచ్చలున్న వారిని ఒప్పించి ఆరోగ్య కేంద్రమునకు పంపి, అవసరమైన పరీక్షలుచేసి యం.డి.టి చికిత్సను ఇప్పించాలి. అంగవైకల్యాలను నివారించాలి. అలా కుష్టు వ్యాధి వ్యాపించకుండా దానిని మానవసమాజం నుండి తొలగించటం. అంటే "10,000 జనాభాలో కుష్టురోగుల సంఖ్య ఒకటి కంటే తక్కువగా నమోదు కావటం" జరగాలి.

ఈ దశాబ్దమంతా కథాప్రవాహమే!

శంకర్

సాహితీ స్రవంతి ప్రచురించిన "కథా ప్రస్థానం" (2002-04) లాంటి కథా సంకలనాలను చూస్తే ఇది కచ్చితంగా కథాప్రవాహపు దశాబ్దమే అనిపిస్తుంది. ఈ పుస్తక ప్రచురణకర్తలన్నట్లు 90ల తర్వాత విరుచుకుపడిన ప్రపంచీకరణ తాకిడికి గురయిన జీవితాల కల్లోలాలు అనేక కథలుగా, గేయాలుగా, కవితలుగా మొత్తం సాహిత్యమే పెనుగాయమై స్రవించింది. పెనుశోకమై ద్రవించింది. పెనుకోపమై విజృంభించింది. రచయితలు, కవులు, వ్యాసకర్తలు ఒక్కరనేవిటి అందరూ తమ రచనలో ప్రపంచీకరణ అనే ప్రస్తావన తీసుకురాకపోతే తమ సృజనకు అర్థం లేదన్నంతగా పరిస్థితి ఒక్క కుదుపు కుది పేసింది. ఆ ప్రకంపనలు ఇంకా తీవ్రమై మన చుట్టూ మోహరించుకునే వున్నాయి. దీన్ని పట్టించుకున్న కథాప్రక్రియ ఒక కథా ప్రవాహాన్నే సృష్టించింది.

సాహితీ స్రవంతి ఒక సాహితీ సంస్థగానూ, ఒక సాహిత్య స్రవంతిగానూ పనిచేస్తూ 'ప్రస్థానం' త్రైమాసిక సాహిత్య పత్రికను నిర్వహిస్తోంది. 2002 నుంచి ఆ పత్రికలో వచ్చిన కథలనుంచి ఏరికూర్చిన సంకలనం ఈ 'కథాప్రస్థానం'. 28 కథలప్రవాహాన్ని 270 పేజీలలో సంకలించారు. ఒంటరి గుడిసె, రజాక్‌మియా సేద్యం, సాఫ్ట్‌వార్, డబ్బుల సముద్రం, ఏనుగుల రాజ్యం, చెమ్మగిల్లిన వసంతం, సారీ జాఫర్, కలుపుమొక్క, నైట్‌మేర్, వేపచెట్టు, గ్లోబలి...ఇలా కథల పేర్లు చూస్తే చాలు ఈ కథలెంచుకున్న కథా వస్తువెంత సమకాలీనమో తెలిసిపోతుంది. ప్రజల కడుపుల్లోని ఆకలి చుట్టూ కమ్ముకున్న ప్రపంచకుట్రల పర్యవసానం ఈ కథల అంతరాత్మని అర్థమయిపోతుంది. "...మన్న మొలిచి నట్టులేదు అప్పుడే సెనికట్టె ఎండకు ఎర్రగా మలమల్లా మాడిపోతాండాది. నిన్న తెచ్చినట్టు లేదు అప్పుడే ఇంట్లో నూకల మూటె దినదినానికి కరిగిపోతాండాది... ఏందిరా ఈ బతుకు?" అనే రజాక్‌మియాల ప్రశ్నలు ఈ కథలు. "తన కోపమే తన శత్రువు-కానీ అతని కోపం నాకూ శత్రువే'' ఎందుకో అంటూ "అతడు-నేనూ" కథలోని తరతరాల ఆమెల ఆవేదనలు ఈ కథలు. "మేము కంప్యూటర్ ప్రాణులమండీ బాబూ, మాకు ఫంక్షనింగే గానీ..థింకింగ్, రీజనింగ్ ఉండవు, ఉండకూడదు" అంటూ కనిపెంచిన అమ్మను చూడ్డానిక్కూడా ఆ అమ్మకే 'సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అనే అబద్ధపు టెలిగ్రాంల్లాంటి "సాఫ్ట్ వార్" బతుకుల స్కానింగ్ ఈ కథలు.

ఇంకా హెచ్చైవీ పాజిటివ్‌ల ఆగని దగ్గుతెరల చావుసావులు, భర్తకు వంశాంకురం అందించేదాకా ఎంతటి బ్లీడింగయినా ఎనిమిక్‌గా భరించే మాలన్‌బీల మౌన'ఫాతేహా'లు ఇలా ఎందరెందరివో జీవితాల బాధలు ఈ కథలనిండా పరుచుకుని ఉంటాయి. ఈ కథాప్రస్థానం తడమని సమస్యలు తక్కువే. ఈ కథల్లోని గాథలను ఒక వరుసలో పేర్చుకుని చూస్తే నిన్నా మొన్నటి... ఈ క్షణంనాటి పచ్చినిజం బతుకులు ఒక డాక్యుమెంటరీ రీలు లాగా మనముందుంటాయి. ఇలాంటి మంచి సంకలనాలు ఉద్యమ సంస్థలకే సాధ్యం. అలాంటి కథాఉద్యమ కర్తవ్యం సాహితీస్రవంతి నిక్కచ్చిగా చేసిందనాలి.

కథా ప్రస్థానం

(2002-04):
ప్రచురణ: సాహితీ స్రవంతి,
పేజీలు:270, వెల:రూ. 100/-
ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.
పేజీలు:270,
వెల:రూ. 100/- ప్రతులకు: ప్రజాశక్తి,
అన్ని బ్రాంచీలు.

స్వీకారం

తెలకపల్లి రవి
వెల: రూ. 5/-

మారిన పరిస్థితులకు తగినట్టు సమరశీలత ప్రదర్శిస్తే ప్రతిఘటనా శక్తులను కూడగడితే పురోగమనం తథ్యమని సోవియట్ విచ్ఛిన్నానంతర అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి మార్క్సిజం మౌలిక పునాదిని బలపరచేవిగా వున్నాయి. ఇందుకు తగినంత మానవీయ కృషిని జోడించడమే ఇప్పుడు జరగాల్సింది. ఈ సందర్భంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని క్లుప్తంగా సమీక్షిస్తూ, ఆ కృషికి దోహదపడే స్ఫూర్తి నందించేది ఈ పుస్తకం.

* * *

గుడిపూడి విజయరావు
వెల: రూ. 5/-

1917 మహత్తర అక్టోబరు విప్లవ స్ఫూర్తితో ఆరంభ మయిన భారత కమ్యూనిస్టు ఉద్యమం స్వాతంత్ర్యోద్యమంలో కూడా తనదైన విశిష్ట పాత్రను నిర్వహించింది. భారత దేశంలో విప్లవ సాధనకు ఏ మార్గం అనుసరించాలన్న దానిపై చెలరేగిన తీవ్ర సైద్ధాంతిక పోరాటాల అనంతరం సిపిఐ(ఎం) ఆవిర్భవించి జనతా ప్రజాతంత్ర విప్లవం దిశగా సాగిపోతున్నది. ఈ ప్రస్థానాన్ని స్థూలంగా వివరించేది ఈ చిన్న పుస్తకం.

* * *



ఆర్. రఘు
వెల:రూ. 5/-

అనేకవర్గాలు, తరగతులు, జాతులు, చేసిన తిరుగుబాటు ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. బాధలు భరించ లేక మొరటుగా చేసిన తిరుగు బాట్లే క్రమంగా చైతన్య పూరితంగా సాగిన మహా స్వాతంత్ర్య సంగ్రామంగా రూపు దిద్దుకున్నాయి. కోటానుకోట్లమంది ప్రజల్ని పరాయి పాలనపెట్టే బాధలు కదిలించాయి. ఐక్యపరిచాయి. ప్రజలు ఎంతటి కష్టాలకీ వెరవకుండా పోరాడారు. పరాయి పాలనపోతే మంచి రోజులు వస్తాయని నమ్మారు - తిండికీ, బట్టకీ, యింటికీ, పనికీ కరువువుండని వ్యవస్థ వస్తుందని ఆశించారు. కానీ అలా జరగలేదు. ఎందువలన?

* * *

భారతదేశంలోనే కాదు ప్రపంచమంతా మార్పు అనే హోరుగాలి వీస్తోంది. ఉషోదయానికి స్వాగతం పలుకుతోంది. అది లాటిన్ అమెరికాలో వేగుచుక్కలా కనిపిస్తుంటే యూరోపులో చిరుగాలిలా సాగుతోంది. ఆసియాలో ప్రచండభానునిరూపంలో కనిపిస్తోంది. ఆఫ్రికాలో నల్లసూరీడు వికసిస్తున్నాడు. నిజంగానే ఇది 90వ దశకం కాదు. 21వ శతాబ్దం. నాలుగేండ్లు గడిచింది. ఇది మరో శకానికి నాంది కావచ్చు. చూద్దాం రండి.

వి. శ్రీనివాస రావు
వెల: రూ. 5/-

ఈ నాలుగు పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో దొరుకుతాయి.

పాపికొండల నడుమ...గోదారి తీరాన...

సిహెచ్.వి.వి.రఘుబాబు

ఆకుపచ్చటి చీర పరచినట్లుగా కనిపించే పచ్చని పంట పొలాలు.. చల్లని పిల్లగాలులు..పల్లె పడుచుల కూనిరాగాలు.. పక్షుల కిలకిలా రావాలు.. గలగలా సాగే గోదావరి తరంగాలు...పడవలను నడిపే వారి అరుపులు. లాంచీల డుబుడుబు శబ్దాలు. పాపికొండల సోయగాలు.. కనులకింపైన రమణీయస్థలాలు...

ఇవి గోదావరి తీరానికి ఆనుకుని ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో అడు గడుగునా కనిపించే కమనీయ దృశ్యాలు. పర్యాటకులకు మధురాను భూతులు, మధుర స్మృతులను అందించడంలో పశ్చిమగోదావరి జిల్లాకు పెట్టిందిపేరు. పరమాద్భుత చారిత్రక దృశ్యాలను తనవితీరా తిలకించమని జిల్లాకు వచ్చే పర్యాటకులకు తల్లి గోదావరి మనసారా ఆహ్వానిస్తోంది. ప్రకృతి


పట్టిసంలోని శివక్షేత్రం

కమనీయ దృశ్యాలకు నిలయమైన పాపికొండల నుండి వందల సంవత్సరాల సుసంపన్నమైన చారిత్రక, సాంస్కృతిక సంపదకు, హస్తకళా కౌశలానికి ఈ జిల్లా వారసత్వం వహిస్తోంది. అద్భుత శిల్పకళా నైపుణ్యానికి దివిటీ పడుతూ ఎన్నో దేవాలయాలు, మండపాలు, ఆరామాలు జిల్లా అంతటా మనకు కన్పిస్తాయి. అందమైన తివాచీలు, రంగురంగుల చేనేత వస్త్రాలు, ప్రాచీన నృత్యశైలులు గోదావరి తీర విశేషాలు.


[illegible] కోసం టూరిజం శాఖ వారి [illegible]

పాపికొండలు

ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన పాపికొండల్లో గోదావరి నదిమీద ప్రయాణం ఒక మరచిపోలేని సుందరస్వప్నం. ఇరుకైన కొండల మధ్య నుండి వంపులు తిరుగుతూ గలగలా ప్రవహించే గోదావరి నదిపై ఒకవైపు భయంభయంతో ప్రయాణం, మరో వైపు చుట్టూ కనిపించే సుందరమైన ప్రకృతి కమనీయ దృశ్యాలు, అహ్లాద వాతావరణం పర్యాటకులకు మరచిపోలేని అనుభూతులను మిగుల్చుతాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు టూరిజం శాఖ ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతోంది. పలు ప్రత్యేక ప్యాకేజీలను కూడా ప్రకటించింది. పర్యాటకులను తీసుకుని పట్టిసీమ నుండి పాపికొండల వరకూ రెండు ప్రత్యేక పెద్ద బోట్లను ఏర్పాటు చేసింది. ఈ ప్రయాణం ఒక రోజు కావడంతో బోటుల్లోనే అల్పాహారం, భోజనం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. పాపికొండలు వెళ్లేందుకు పిల్లలకు 150 రూపాయలు, పెద్దలకు 300 రూపాయలు ఛార్జీ ఉంటుంది. టిక్కెట్లను ఇ-సేవాకేంద్రాలు, ఇంటర్‌నెట్ నుండి కూడా తీసుకునే అవకాశాన్ని కల్పించారు. అలాగే అక్కడ ఉండేందుకు కాటేజీలను కూడా నిర్మించింది. కొన్ని కాటేజీలకు ఎసిని కూడా ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ పట్టిసీమ నుండి



పాపికొండలకు వెళ్లవచ్చు. అయితే ఆదివారం, సెలవు, పండుగ రోజుల్లో వివిధ జిల్లాల నుండి సైతం వచ్చే పర్యాటకులతో ఈ ప్రాంతం రద్దీగా, కోలాహలంగా, సందడిగా ఉంటుంది. ఏలూరు నుండి 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టిసీమ వచ్చి అక్కడ నుండి పాపికొండలకు వెళ్లాలి. పట్టిసీమ నుండి దాదాపు 80 కిలోమీటర్ల దూరం వరకూ ప్రత్యేక బోటులోనే ప్రయాణం చేయాలి.

పట్టిసీమ

చుట్టూ ఎత్తైన పర్వత సానువులు... మధ్యలో విశాలంగా విస్తరించి ఉన్న గోదావరి నది... నడుమ వీరభద్రుడు... ఇదీ పట్టిసీమ మనోహర దృశ్యకావ్యం. పట్టిసీమ పర్యాటకులకు భూతల స్వర్గధామం. గోదావరి నదీ మధ్యలో ఎత్తైన దేవకూట పర్వతంపై ఈ దేవాలయం ఉంది. శివభక్తులు అమితంగా ఆరాధించే పంచశక్తి క్షేత్రాలలో ఈ క్షేత్రం కూడా ఒకటని చెబుతారు. పట్టిసీమ అందాలను, గోదావరి సోయగాలను ఇప్పటికే ఎన్నో సినిమాలలో అత్యద్భుతంగా చిత్రీకరించారు. పర్యాటకులు పశ్చిమగోదావరి జిల్లాలో తప్పకుండా చూడవలసిన అపురూప దృశ్య కావ్యాలలో పట్టిసీమ ఒకటి. శివరాత్రి, పండుగ సమయాల్లో ఇక్కడ పర్యాటకులతో కోలాహలంగా ఉంటుంది. ఇక్కడికి వెళ్లినవారికి విడిది చేయడానికి అనువైన కాటేజీలను టూరిజం శాఖవారు ఏర్పాటుచేశారు. మరో ముఖ్య విషయం. ఒకవేళ కాటేజీలలో దిగేంత స్తోమత లేనివారు అక్కడి గిరిజన గూడేలవారితో మంచి సాన్నిహిత్యం గా మెలగగలిగితే మంచి ఆతిథ్యం వారే ఇస్తారు. ❋


కొవ్వూరు-పట్టిసం-పాపికొండలు పర్యటనకు టూరిజం శాఖ ఏర్పాటు చేసిన బోటు

నాటకానికి నీరా'జనం'

విస్సా శేషగిరిరావు

రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 'నంది నాటకోత్సవాలు' వైభవంగా జరిగాయి. జనవరి 16 నుంచి 23 వరకూ జరిగిన ఈ నంది నాటకోత్సవానికి ప్రేక్షక జనం నీరాజనాలు అందించారు. వారం రోజుల పాటు జరిగిన నంది నాటకోత్సవాలు నగర ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి. ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ప్రదర్శనలు జరిగాయి. మొత్తం 32 నాటక, నాటిక ప్రదర్శనలు జరిగాయి. తెలుగునాటకంలో వస్తోన్న అనేక మార్పులకు ప్రదర్శనలు అద్దం పట్టాయి. తెలుగు నాటక రంగాన్ని పునర్జీవింపజేయాలనే తలంపుతో 1999 నుంచి ప్రభుత్వం ఈ నంది నాటకోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. 'జీవితాన్ని ప్రతిబింబించేది నాటకం...నాటకానికి ప్రతిస్పందించేదే జీవితం' అనే నాటక ప్రయోక్తల నానుడికి విజయవాడలో జరిగిన నంది నాటకోత్సవాలు అద్దం పట్టాయి. ప్రతి నాటకంలోనూ నేటి సమకాలీన పరిస్థితులను వివరిస్తూ తద్వారా ఏమి జరుగుతుందీ, ఏం జరిగితే సమాజం బాగుంటుంది, అనే అంశాలను ప్రతీ రచయిత, దర్శకుడు వివరించేందుకు ప్రయత్నించారు. దిగజారుతున్న మానవీయ విలువలను ఒక నాటకం వివరిస్తే... మృగ్యమవుతున్న మానవ సంబంధాలను మరో నాటిక విశ్లేషించింది. అలాగే భారతదేశం వంటి భిన్న సంస్కృతుల సమ్మేళనమైన ఈ సమాజంలో మతాల, కులాల కుమ్ములాటలతో రాజకీయ నాయకులు ప్రజాజీవనాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నారో రచయితలు చక్కగా తమ నాటకాల్లో చూపించేందుకు ప్రయత్నించారు. తెలుగు వారి సాహితీ ప్రాభవాన్ని సమున్నతంగా చాటే పద్యనాటకాలు సైతం పౌరాణిక, చారిత్రిక గాథలను వివరిస్తున్నా అంతర్లీనంగా సామాజిక కోణాన్ని విస్మరించకపోవడం అభినందనీయం. ప్రతిభావంతులైన కళాకారులు ఒక మంచి నాటకాన్ని ప్రదర్శిస్తే ప్రేక్షకులకు ఎటువంటి ఢోకా లేదు అనే విషయాన్ని నంది నాటకోత్సవాలు మరోసారి స్పష్టం చేశాయి. ఆడిటోరియంలో సీట్ల కోసం ఘర్షణలు సైతం జరిగాయంటే ప్రేక్షకుల హాజరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రేక్షకుల సంఖ్యను చూసిన రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ఆడిటోరియం ప్రాంగణంలో ప్రత్యేక తెరలను ఏర్పాటు చేసి నాటక ప్రదర్శనలను ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేసింది. ప్రేక్షకులు కూర్చొని ప్రదర్శనలను తిలకించేందుకు వీలుగా కుర్చీలను కూడా వేసింది. అవి కూడా చాలకపోవడంతో వందలాది మంది ప్రేక్షకులు ఒంటి కాలిపై నిలబడి ఈ నంది నాటకోత్సవాలను తిలకించారు. ఏటా మే మాసంలో జరిగే ఈ ఉత్సవాలను ప్రభుత్వం ఈసారి జనవరి మాసంలో నిర్వహించింది. దీనికి కారణం మే మాసంలో ఈ ఉత్సవాలను నిర్వహించడం వలన ఆయా నాటక సమాజాలు రాష్ట్రంలోని అన్ని పరిషత్‌ల్లో పాల్గొనలేక పోతున్నాయి. ఈ నంది నాటకతోత్సవాల్లో పాల్గొనే నాటక, నాటికలు ప్రథమంగా నంది నాటకోత్సవాల్లోనే ప్రదర్శించాలనే నిబంధన ఉండటంతో సమాజాలకు తీవ్ర నష్టం కలగడమే కాకుండా ఆయా నాటకాలు ఎక్కువ ప్రాంతాల్లో ప్రదర్శించడానికి వీలు లేకుండా పోయింది. ఈ విషయాన్ని రెండు మూడు


నంది నాటకోత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

విషాదగీతం

కడలి ఒడిలో నిదురించే కడలిబిడ్డల కడగండ్లు
ఆస్తుల్ని ఆప్తుల్ని కోలుపోయి మిన్నంటే ఆక్రందనలు
సముద్రభూకంపానికి నిలువుటద్దాలు
ఈ లోటు ఎవరు పూడ్చగలరు
ఈ పోటు ఎవరాపగలరు
ఉన్నట్టుండి సముద్రం అలలచేతులతో పైకెగసి...
సముద్రం ప్రతీసారీ జీవనగీతం
అప్పుడప్పుడూ ఇలా విషాదగీతం

-మంకుశ్రీను

ఆ ఉషోదయాన... "సునామీ"

కడలి తరంగ ప్రతాపం
మృత్యు మృదంగ విన్యాసమై
విపత్తుగా మొలకెత్తి
కడలి గర్భాన జన్మెత్తి
"సునామీ" గా రూపెత్తి
సముద్ర గంభీర వదనాన మృత్యువయ్యింది

కెరటకల్లోల విలయ తాండవం
మృత్యు కుహూరాన జనావళిని పడద్రోసి
కప్పేసిన జలప్రళయ ఉత్పాత ఉక్రోషం
తెలతెల్లవారకనే బతుకులెన్నింటినో తెల్చిచ్చింది
కడ (లి) తీర్చిన లవణజల ఉపద్రవం
తెప్పలు తెప్పలుగా ముప్పును మిగిల్చి
కట్టలు త్రెంచుకొన్న సంద్ర ప్రచండానికి
ఉప్పెనూరును కబళించిన ఆ ఉషోదయం...
విషాదమయం
శవాల గుట్టలపై 'సునామీ' చిద్విలాసం

-చందులూరినారాయణరావు.

'ఆంబోతు' నాటికలోని ఓ దృశ్యం

సంవత్సరాలుగా కళాకారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్వతహాగా కళాకారుడైన రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రమణాచారి స్పందించి ఈ సంవత్సరం జనవరి మాసంలో నంది నాటకోత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించారు. అందులోనూ గత సంవత్సరం వరకూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన ఈ ఉత్సవాలను జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తే బాగుంటుందనే కోరికను రాష్ట్ర రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చింది. రమణాచారి దీనిని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మొట్టమొదటి సారిగా విజయవాడ నగరంలో నిర్వహించేందుకు కృషి చేశారు. అందుకు గాను విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రాన్ని నగర పాలక సంస్థ సుమారు రూ.40 లక్షల వ్యయంతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా పలు ఆధునిక వసతులను కూడా సమకూర్చింది.

ప్రభుత్వ ప్రకటనకు స్పందించిన రాష్ట్రంలోని నాటక సమాజాలు 85 పద్య నాటకాలను, 55 సాంఘిక నాటకాలను, 109 సాంఘిక నాటికలకు సంబంధించిన దరఖాస్తులను పంపించాయి. ప్రభుత్వం నియమించిన తొమ్మిది మంది న్యాయనిర్ణేతల బృందం నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రాథమిక పరిశీలన చేశాయి. అందులో పది పద్య, పది సాంఘిక నాటకాలను, పన్నెండు సాంఘిక నాటికలను ఎంపిక చేసి విజయవాడలో ప్రదర్శనకు అవకాశం కల్పించారు. ఇందులో పద్య నాటక విభాగంలో "వీరపాండ్య కట్టబ్రహ్మన్న", "నిగమశర్మ", ; "వీరాభిమన్యు", "దక్ష ప్రజాప్రతి", "ఏసు-బరబ్బాసు", "భక్త మాధవదాసు", "సుభద్రా విజయం", "అశ్వత్థామ", "భయోభయో నమామ్యహమ్", "శశిరేఖ పరిణయం"లో సాంఘిక నాటక విభాగంలో "మాయ", "ధగ ధగ రాజ్యం", "ధర్మసూత్రం", "కౌపీన సంరక్షణార్థం", "మృత్యువుతో ముఖాముఖి", "గర్భగుడి", "వనం", "ఓం", ఎలా బతకాలి?, "వలయం", ప్రదర్శించారు. సాంఘిక నాటికల భాగంలో "సుముద్ర్నక కెర టాలుండాలి", "మిధునం", "మానవత్వానికి మరోకోణం", "దేవునిరూపం", "గ్రహణం", "ఆంబోతు", "ఐదోగది", "బీజమంత్రం", "పుణ్యస్థలం", "పానకంలో పుడక", "సారే జహా సే అచ్ఛా," "రాక్షసుడు" తదితర నాటిక ప్రదర్శనలు ప్రదర్శింపబడ్డాయి.



'భయోభయో నమామ్యహమ్' పద్య నాటకంలోని ఓ దృశ్యం

నాటకాన్ని బతికించండి: మిక్కిలినేని

నంది నాటకోత్సవాలను సుప్రసిద్ధ రంగస్థల, సినీ నటుడు, రచయిత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన అపూర్వమైన స్వాగతాన్ని అందుకున్నారు. 89 సంవత్సరాల వయస్సులో కూడా నాటకాన్ని బతికించుకోవాలనే ఆయన తపన రంగస్థల కళాకారులను మరింత ఉత్సాహాన్ని అందించింది. ఈ సందర్భంగా మిక్కిలినేని 125 సంవత్సరాల తెలుగు నాటక రంగ ప్రస్థానాన్ని వివరించారు. తెలుగు వారికి మాత్రమే పరిమితమైన పద్య నాటకాన్ని సురభి సంస్థలు, సాంఘిక నాట కాన్ని ప్రజా ఉద్యమాల రంగ స్థలమైన ప్రజా నాట్య మండలి ఏ విధంగా పరిరక్షిం చు కుంటున్నాయో పేర్కొన్నారు. నాటకాన్ని బతికించు కునేందుకు పలువురు సుప్రసిద్ధ కళాకారుల త్యాగాలను, పోరాటాలను ఆయన సవి వరంగా కళాకారులకు గుర్తు చేశారు. ✱

ధ్వంసం కానీయండి

ధ్వంసం కానీయండి
ధనికవర్గ దురహంకారం
శ్రమజీవుల శ్రమదోపిడి
ఇకపై ఇక చెల్లదంటు
॥ధ్వంసం కానీయండి॥
అమానుష యాజమాన్య ధోరణిని నిరసించి
వ్యక్తికంటు విలువీయని ఉన్మాదుల విపరీతం
రక్తాన్ని పీల్చుచున్న ధనికవర్గ దోపిడి
మరల మరల జరగకుండ ఖబడ్దారంటు మరి
॥ధ్వంసం కానీయండి॥
రెక్కాడితేగానీ డొక్కాడని చిరుద్యోగ నిరుపేదలు
ఆకలికి అలమటించి ఆందోళన దిగమింగుతూ
శ్రమజీవుల నిజజీవుల శ్రమ ఫలితం నిరాకరిస్తే
జీవిత భారాన్ని మోస్తున్న అభాగ్యులు
॥ధ్వంసం కానీయండి॥

చదువులంటే తెలియని నిరక్షర వ్యాపారులు
చదువుకంటు విలువీయని ధనికవర్గ గర్వాంధులు
కరుణంటు లేని జనం కర్కశ క్రీడలకు
శ్రమదోపిడి దొంగలను తరిమి తరిమికొట్టుతూ
॥ధ్వంసం కానీయండి॥
ఈ రాజ్యం నీదేరా, ఈ శ్రమ నీదేరా
శ్రమ ఫలితం పోనీక, పోరాక్కటే దిక్కంటు
బ్రతుకుటకు భారమైన, బడుగువర్గ భవితవ్యం
శ్రమశక్తికి విలువెంతో, నిక్కచ్చిగా చెప్పేస్తూ
॥ధ్వంసం కానీయండి॥

– పేటేటిరత్న

✱

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

కులాంతర వివాహం-సంతానం

వెనుకబడిన తరగతులకు (బి.సి) చెందిన ఒక పురుషుడు, షెడ్యూల్డ్ కులానికి (ఎస్.సి) చెందిన ఒక మహిళ వివాహం చేసుకుంటే వీరికి పుట్టిన సంతానానికి బి.సి/ ఎస్.సిలలో ఏది వర్తిస్తుంది.

ఓ.వెంకటేశ్వర రావు, బుచ్చిరెడ్డిపాళెం,
నెల్లూరు జిల్లా.

చాలా కాలంగా ఒక బలమైన కులవ్యవస్థ అమలు అవుతోంది. కులాంతర వివాహాలు జరిగినప్పుడు, వారికి సంతానం పెరిగి పెద్దయినప్పుడో ఈ కులానికి చెందిన అంశాలు పట్టించుకోవాల్సివస్తోంది. ఆ పిల్లల్ని బడిలో వేసేటప్పుడు కులం, మతం, జాతికి చెందిన అంశాలు పూరించాల్సివస్తుంది. అప్పటినుంచే అమ్మాయిది ఏ కులం అయినా కూడా అబ్బాయి కులానికి చెందిన పరిధిలో భావించడం జరుగుతోంది. ఏదిఏమైనా తండ్రి యొక్క వారసత్వమే వర్తిస్తుంది. కావున బి.సి గానే పరిగణనలో పెడతారు.

ఇష్టంతో రాస్తే చెల్లెలికి వాటారాదు

మేము ఇద్దరం అన్నదమ్ములము. ఒక చెల్లెలు ఉన్నది. మా అమ్మగారికి వారి పుట్టింటివారు ఇచ్చిన సొమ్ముతో 6 గదుల పెంకుటిల్లు ఆవిడ పేర్న కొనుగోలు చేసి ఉన్నది. మా తండ్రి గారు మా చిన్నతనంలోనే పోయారు. మా అమ్మ గారి వయస్సు 70 సం॥ ఆమె సంతానం అయినటువంటి వేం ముగ్గురం. పెళ్ళిళ్ళు అయిపోయినవి. మా పిల్లలకు కూడా పెళ్ళిళ్ళు అవుచున్నవి. మాకు పెళ్ళిళ్ళు అయిన కొత్తలో అనగా 1980 సం॥లో నాకు మా తమ్మునకు, చెరోక 3 గదులు తెల్లకాగితం పై పూర్తి హక్కుగా అనుభవించులాగున ఆమె సంతకం పెట్టి వ్రాసిఇచ్చినారు. రిజిస్ట్రేషన్ చేయలేదు. కానీ ఈ మధ్య అనగా 1902 సం॥ మా పెద్దబ్బాయి. దురుద్దేశంతో మా అమ్మగారి వృద్ధాప్యమును, అమాయకత్వమును ఆసరాగా చేసికొని నాకు రాసిన 3 గదులలో సగభాగము మాకు ఎవ్వరికీ తెలియకుండగా పూర్తి హక్కుగా వ్రాయించుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇప్పుడు కుమారుడుగా ముందు రాసిన 1980లో కాగితం మీద నాకు హక్కు వుంటుందా లేక మా అబ్బాయి రాయించుకున్న రిజిస్ట్రేషన్ పత్రమునకు హక్కు వుంటుందా? నేను లీగల్‌గా ఎలా చేయాలో తెలుప గలరు. ఇప్పుడు ఈ గొడవలన్నీ బయటకు వచ్చాక, మా చెల్లి మొత్తం 6 గదుల మీద నాకు వాటా వస్తుంది అని అంటుంది. దీని గురించి పూర్తి వివరణ ఇవ్వవలసిందిగా తమను కోరడమైనది.

అప్పారావు, పిఠాపురం.

మీ అమ్మగారు మీ ఇరువురి అన్నదమ్ముల మీద వ్రాసిన కాగితం మీరు ప్రభుత్వరికార్డుల్లో అనగా గ్రామపంచాయితీల్లో ఎక్కడైనా ఎగ్జిక్యూట్ చేయించుకున్నారా? లేదా ఎగ్జిక్యూట్ చేసి ఉంటే బిల్లులు మీరు మీ పేరు మీద చెల్లిస్తున్నారా? లేదా తెలుపలేదు. మీ పేరుమీద ఉండి ఉంటే పబ్లిక్‌నోటీస్ ఇచ్చి ఆపై మీ అబ్బాయి గారి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయించడంకోసం కోర్టులో దావా వేసుకోవాలి. మీ అమ్మగారు మీ ఇరువురికి ఇంతకుక్రితమే తన ఇష్ట పూర్తిగా వ్రాయించి ఇచ్చింది. కావున ఈ ఆస్తిపై మీ చెల్లెలికి ఎటువంటి వాటా ఉండదు. ఇదికాకుండా మిగతా ఏమైనా ఉంటే వాట మీద హక్కుఉంటుంది.

మరోపెళ్ళి చేసుకున్న పిన్ని సంతానానికి హక్కులుంటాయా?!

మా నాయనమ్మగారు మా నాన్నగారి పేరున పొలము రాశారు. ఇప్పుడు మా నాన్న గారు తమ్ముడు గారు అయిన మా బాబాయికి మొదటి పెళ్ళికి ఒక పిల్లవాడ్ని కన్నది. అయితే మా చిన్నమ్మగారు ఆ పిల్లవాడిని కనే వరకు మా దగ్గరే ఉన్నది. ఆ తర్వాత వాళ్ళ పుట్టింటికి వెళ్ళింది. మా బాబాయి మరోపెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు పిల్లలు లేరు. తర్వాత మా బాబాయి చనిపోయాడు. అంతకు ముందే మా బాబాయి మొదటి భార్య ఒక పిల్లవాడు ఉండగా మరోపెళ్ళి చేసుకుంది. అప్పటి మా బాబాయి బ్రతికే ఉన్నాడు. కొన్నాళ్ళకు ఆమె చేసుకున్న భర్త చనిపోయాడు. ఆయనకు కూడ ఒక పిల్లవాడిని కన్నది. అయితే ఇప్పుడు మా నాయనమ్మగారు మానాన్న గారు పొలం రాసిందని తెలిసి తన కొడుకు పేరున పొలము రాయమంటోంది. అయితే ఇప్పుడు ఆమె మొదటి కొడుకుకు వాటా ఉంటుందా దయచేసి వివరంగా తెలుపగలరు.

జి.లలితరాణి, అమరావతిమండలం
గుంటూరు జిల్లా.

మీ పిన్ని గారు మరో పెండ్లి చేసుకుంది. కావున ఆమెకు ఎటువంటి వాటా ఉండదు. కాని, మీ బాబాయ్ గారి కుమారుడు అంటే మీ పిన్ని పెద్ద కుమారుడికి తప్పకుండ ఆస్థిలో భాగం ఉంటుంది. మీ బాబాయి ఆస్థి ఆయన భార్యగ మీ రెండవ పిన్నీ గార్కి మరియు వారసుడిగా మీ పెద్దపిన్ని కుమారుడికి హక్కు వుంటుంది.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

దొండకాయ పెరుగు కూర

కావలసిన వస్తువులు :

దొండకాయలు	: పావు కిలో
పచ్చిమిర్చి	: రెండు
ఉప్పు	: తగినంత
కారం	: తగినంత
పసుపు	: తగినంత
కొత్తిమీర	: ఒక కట్ట
ఉల్లిపాయ	: ఒకటి
పెరుగు	: పావు లీటరు
కరివేపాకు	: రెండు రెబ్బలు
నూనె	: రెండు గరిటెలు

తయారుచేసే విధానం :

దొండకాయలను శుభ్రంగా కడగాలి. నాలుగు చీలికలుగా కట్ చేయాలి. ఉల్లి, పచ్చిమిర్చి సన్నగా తరగాలి. పొయ్యి మీద గిన్నెలో నూనె పోసి కాగనివ్వాలి. తాలింపు గింజలు, ఉల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేగనివ్వాలి. ముక్కలు వేసి ఉప్పు, కారం, పసుపు వేసి కొద్దిగా నీళ్ళు వేసి మూత పెట్టి ఉడకనివ్వాలి. నీరంతా ఇగిరి ముక్కలు ఉడికిన తరువాత పెరుగు వేసి ఒక ఉడుకు ఉడకనిచ్చి దించాలి. కొత్తిమీర చల్లి వడ్డించుకోవాలి.

కొబ్బరి కోఫ్తా కర్రీ

కావలసిన వస్తువులు :

కొబ్బరి కాయ	: ఒకటి
శనగపిండి	: వంద గ్రాములు
పచ్చి బఠాణీ	: వంద గ్రాములు
వెల్లుల్లి	: ఒకటి
కరివేపాకు	: రెండు రెబ్బలు
కారం	: ఒక స్పూను
లవంగాలు	: నాలుగు
గసాలు	: ఒక స్పూను
నూనె	: రెండు గరిటెలు
అల్లం	: ఒక చిన్న ముక్క
ఉప్పు	: తగినంత
పసుపు	: అర స్పూను
దాల్చిన చెక్క	: రెండు ముక్కలు
కొత్తిమీర	: ఒక కట్ట

తయారుచేసే విధానం :

పచ్చి కొబ్బరి తురిమి, శనగపిండి, ఉప్పు కలిపి ఆవిరి మీద ఉడికించాలి. బఠాణీలు కూడా మెత్తగా ఉడికించాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి బాగా సన్నగా ముక్కలు తరగాలి. అల్లం. వెల్లుల్లి, గసాలు, లవంగం మెత్తగా నూరాలి. ఆవిరి మీద ఉడికించిన పచ్చి కొబ్బరి, శనగపిండిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనెపోసి కాగనివ్వాలి. నూనె కాగగానే తాలింపు వేసి కరివేపాకు, పచ్చి మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేగనివ్వాలి. బఠాణీలు, కోఫ్తా ముక్కలు వేసి వేయించాలి. ఉప్పు, కారం, పసుపు వేసి నీళ్ళు పోసి ఉడికించాలి. దించే ముందు మసాలా ముద్ద వేసి ఒక నిముషం ఉంచాలి. కొత్తిమీర శుభ్రంగా కడిగి సన్నగా తరిగి కూరలో వేసి మూత పెట్టాలి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా ఒక పోస్ట్ కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : కె.రాజశేఖర్
వయసు : 15 సం॥
హాబీలు: ఖోఖో ఆడడం, పాటలు పాడడం, ప్రజాశక్తి పేపరు చదవడం.
స్కూల్: గురుకుల పాఠశాల, అచ్చంపేట.
చిరునామా:
కె.రాజశేఖర్, సన్నాఫ్ కె.జయానందం, మల్దకల్ (మం), మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : రిజ్వానా బేగం
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు: చదవడం, పోటీల్లో పాల్గొనడం.
చిరునామా:
రిజ్వానాబేగం, డాటరాఫ్ ఎన్.కె.మౌలానా, 44-1-19/3, ఎం.టి.పాలెం, అక్కయ్యపాలెం (పోస్ట్), విశాఖపట్నం-16,
పిన్: 530 016.

పేరు : ఎం.రాజేశ్వరి
వయసు : 6 సం॥
చదువు: 1వ తరగతి
హాబీలు: అల్లరి చేయడం, ఆడుకోవడం.
చిరునామా:
ఎం.రాజేశ్వరి, డాటరాఫ్ కోటిరెడ్డి, చింతలపాలెం, శంఖవరం (పోస్ట్), ప్రకాశం జిల్లా. **పిన్:** 523 254.

పేరు : పి.పవన్ ఆదిత్య
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, టీవీ చూడడం, డ్రాయింగ్ వేయడం.
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
పి.పవన్ ఆదిత్య, సన్నాఫ్ పి.వి.జి.ఎస్.రావు, హౌస్ నెం: 6-1-30/4, మాల్కాపూర్ రోడ్డు, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.

పేరు : ఎం.డి.రియాజ్
వయసు: 7 సం॥
చదువు: 3వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, సైకిల్ తొక్కడం.
చిరునామా:
మొహమ్మద్ రియాజ్, సన్నాఫ్ ఎన్.కె మౌలానా, 44-1-19/3, ఎం.టి.పాలెం, అక్కయ్యపాలెం పోస్ట్, విశాఖపట్నం - 16,
పిన్: 530 016.

పేరు : ఎం.సుమలత
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: టీవీ చూడడం, ఆటలు ఆడడం, ప్రజాశక్తి చదవడం.
చిరునామా:
ఎం.సుమలత, డాటరాఫ్ కోటిరెడ్డి, చింతలపాలెం, శంఖవరం (పోస్ట్), కనిగిరి (మం), ప్రకాశం జిల్లా.
పిన్: 523 254.

పేరు : సాగాల సంయుక్త
వయసు: 9 సం॥
చదువు : 4వ తరగతి
స్కూల్: గాయత్రి విద్యామందిర్
హాబీలు: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం చదవడం, టీవీ చూడడం.
చిరునామా:
సాగాల సంయుక్త, డాటరాఫ్ సాగర్, హౌస్ నెం: 1-149, కాశీపేట (పోస్ట్ & మం), ఆదిలాబాద్ జిల్లా.
పిన్: 504 232.

పేరు : ఎన్ సుబ్బారావు
వయసు : 14 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి చదవడం.
స్కూల్: సాయినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, గొలగమూడి
చిరునామా:
ఎన్ సుబ్బారావు, సన్నాఫ్ ఎన్.మస్తానయ్య, అనికేపల్లి, వెంకటాచలం (మం), నెల్లూరు జిల్లా.